## ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
సంపుటి: 6 సంచిక: 103, పేజీలు - 08
మంగళవారం,అక్టోబర్ 13, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# డబ్బులు పెట్టు అక్రిడేషన్ కార్డు పట్టు

- ▶ నిబంధనలకు విరుద్ధంగా అక్రిడేషన్ కార్డుల జారీ జరుగుతోందా.?
- ▶ నిజమైన జర్నలిస్టులకు అన్యాయం.. అర్హత లేనివారికి అందలం
- ▶ డబ్బులిస్తే కార్డు రెడీనా.? కమిటీ కనుసన్నల్లోనే అక్రమ దందా సాగుతోందన్న ఆరోపణలు
- ▶ రబ్బర్ స్టాంపులుగా మారిన డీపీఆర్వోలు.. బాధ్యత కమిటీదంటూ తప్పించుకుంటున్నారా.?
- ▶ పదో తరగతి అర్హత కూడా లేనివారికి కార్డులా.? అసలు జర్నలిస్టులకు మాత్రం నిరాశేనా.?
- ▶ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి సారధ్యంలో అస్తవ్యస్తంగా అక్రిడేషన్ ల జారి
- ▶ అక్రమాలకు చోటు లేదన్న మంత్రి పొంగులేటి మాటలకు క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతన ఎక్కడ.?






హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియపై మరోసారి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అర్హత కలిగిన నిజమైన జర్నలిస్టులకు కార్డులు అందక అనేక ఇబ్బందులు ఎదురవుతుంటే, అసలు జర్నలిజంతో సంబంధం లేనివారికి, అర్హతలు లేనివారికి అక్రిడిటేషన్ కార్డులు ఎలా అందుతున్నాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం జరగాల్సిన కార్డుల జారీ ప్రక్రియలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయన్న ఆరోపణలు జర్నలిస్టు వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

### డబ్బులుంటే చాలు.. కార్డు చేతిలోనా.?

ఏళ్ల తరబడి ప్రజా సమస్యలపై వార్తలు రాస్తూ, అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తూ, ప్రజల పక్షాన నిలుస్తున్న నిజమైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డు పొందడం కష్టంగా మారిందన్న ఆవేదన వ్యక్తమవుతోంది. మరోవైపు డబ్బులు చెల్లిస్తే కార్డు సులభంగా వస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణల్లో వాస్తవమెంత.? ఎవరెవరి పాత్ర ఉంది.? కార్డుల జారీ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు చోటుచేసుకున్నాయి.? అన్న అంశాలపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందని జర్నలిస్టు సంఘాలు పేర్కొన్నాయి.అక్రిడిటేషన్ అనేది అర్హులైన జర్నలిస్టులకు నిబంధనల ప్రకారం కల్పించాల్సిన గుర్తింపు. కానీ అదే ప్రక్రియలో అక్రమాలకు తావుంటే జర్నలిజం విలువలకే మచ్చ పడుతుందన్న విషయం ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డికి తెలియకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. డబ్బులు చెల్లించలేని నిజమైన జర్నలిస్టులకు అన్యాయం జరిగి, రిపోర్టర్ కాకుండా పలుకుబడి ఉన్నవారికి ప్రయోజనం చేకూరితే ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా నిలవాల్సిన మీడియా వ్యవస్థపైనే ప్రజలకు నమ్మకం సన్నగిల్లే ప్రమాదం ఉంది.

### పదో తరగతి అర్హత లేనివారికి కార్డులెలా.?

అక్రిడిటేషన్ కార్డుల జారీకి నిర్దేశించిన అర్హతలు, విద్యార్హతలు, అనుభవం, మీడియా సంస్థలకు సంబంధించిన నిబంధనలు సక్రమంగా అమలవుతున్నాయా.? అన్న ప్రశ్నలకు చైర్మన్ సమాధానం చెప్పగలరా.?
కనీస విద్యార్హతలు లేనివారికి సైతం కార్డులు జారీ అయ్యాయన్న ఆరోపణలు నిజమైతే, వాటి వెనుక ఉన్న కమిటీలను బయటపెట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అర్హతలేని వ్యక్తులకు కార్డులు జారీ అయినట్లు ఆరోపణలు వస్తున్నప్పుడు సంబంధిత దరఖాస్తులు, ధ్రువపత్రాలు, కమిటీ సిఫారసులు పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### డీపీఆర్వోలు అధికారులా.? రబ్బర్ స్టాంపులా.?

అక్రిడిటేషన్ కార్డుల జారీలో జిల్లా స్థాయిలో కీలక బాధ్యతలు నిర్వహించాల్సిన డీపీఆర్వోలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తున్నారా.? లేక కమిటీ నిర్ణయాల పేరుతో చేతులెత్తేస్తున్నారా.? అన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కార్డుల జారీలో అవకతవకలపై ప్రశ్నిస్తే తమకేమీ తెలియదని, అంతా కమిటీకే తెలుసని అధికారులు చెబుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరి అన్ని కమిటీలు చూసుకున్నప్పుడు డిపిఆర్ఓ అధికారులు ఎందుకోసమని జర్నలిస్టు సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. కొంతమంది డిపిఆర్ఓ లు ఏదో చిన్నచిన్న సాకులు చెప్పి నిజమైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు జారీ అయిన తర్వాత కూడా ఇవ్వకుండా కార్యాలయం చుట్టూ తిప్పుకోవడం ఎంతవరకు సమంజసం. ఇంకో విషయం అక్రిడికేషన్ కార్డులు జారీ చేసే ముందు డిపిఆర్ఓ లు పదవ తరగతి (ఎస్ఎస్సి) ఒరిజినల్ మెమో చూసి ఇచ్చారా.? ఒకవేళ ఇవ్వకుంటే నకిలీ సర్టిఫికెట్లు పెట్టి అక్రిడేషన్ కార్డు పొందిన వారు ఉంటే వారి బాధ్యత వహించాల్సింది సంబంధిత జిల్లా డీపీఆర్వోలు మాత్రమే. అదే నిజమైతే అధికారుల పరిశీలన, ధ్రువీకరణ, బాధ్యతలకు అర్థమేంటి.? నిబంధనలకు విరుద్ధంగా కార్డులు జారీ అయితే సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సిన అవసరం లేదా ? ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హతలను నిర్ధారించాల్సిన సమాచార శాఖ ఎందుకు మౌనంగా ఉంటోందన్నది సమాధానం లేని ప్రశ్నగా మిగిలింది.

### ప్రెస్ అకాడమీ చైర్మన్ జోక్యం ఎక్కడ.?

ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి నిజమైన జర్నలిస్టుల సమస్యలపై స్పష్టత ఇవ్వాలని పలువురు జర్నలిస్టులు కోరుతున్నారు. ఇండిపెండెంట్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని కోరితే కమిటీ నిర్ణయాలంటూ సమాధానాలు వస్తున్నాయని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు విమర్శిస్తున్నారు. స్వతంత్ర జర్నలిస్టుల అర్హతలను పరిశీలించి న్యాయం చేయాల్సిన బాధ్యత ఎవరిది.? కమిటీ నిర్ణయాల వెనుక ఉన్న ప్రమాణాలేమిటి.? అర్హులైన ఫ్రీలాన్స్ జర్నలిస్టుల దరఖాస్తులు తిరస్కరణకు గురైతే, అందుకు కారణాలు వెల్లడించాల్సిన అవసరం లేదా.? జిల్లాలలో చైర్మన్ వర్గీయులు ఆయనకు సంబంధించిన యూనియన్ నాయకులదే హవా నడుస్తుందని వారి కనుసైగల్లోనే అనేక అక్రిడేషన్ కార్డులు జారీ అయినట్లు జర్నలిస్టులు ఆరోపిస్తున్నారు. అయితే ఎలాంటి అర్హత లేకున్నా నిబంధనలకు విరుద్ధంగా అక్కడేషన్ కార్డులు జారీ అయిన వాటికి చైర్మన్ బాధ్యత వహించాలని ఆయన బాధ్యతారాహిత్యం తోనే అక్రిడేషన్ జారీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చైర్మన్ మాటల్లో జర్నలిస్టుల సంక్షేమం, సమానత్వం ప్రతిఫలిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో కార్డుల జారీపై వస్తున్న ఆరోపణలు అందుకు భిన్నంగా ఉన్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చైర్మన్ స్వయంగా స్పందించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉందని లేని పక్షంలో రాజీనామా చేయాలని జర్నలిస్టు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

### మంత్రి మాటలకు.. క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతన ఎక్కడ.?

సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అక్రిడిటేషన్ విధానంపై చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయిలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలకు మధ్య వ్యత్యాసం చాలా ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మంత్రి వేసి లో జర్నలిస్టుల సమస్యలపై వినతి పత్రాలు ఇచ్చిన స్పందన లేదని జర్నలిస్టుల వినతి పత్రాలు చెత్త బుట్ట దాఖలైనాయా.? అంటూ జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాచార శాఖ మంత్రి స్పందించకుంటే పరిస్థితి ఏమిటని, అర్హులైన జర్నలిస్టులకు న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత. అక్రిడిటేషన్ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చూడాల్సిన అవసరం మంత్రిపై లేదా అన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### ఇప్పటికైనా సమగ్ర విచారణ జరపాలి

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అక్రిడిటేషన్ కార్డుల జారీ పూర్తి అస్తావ్యస్తంగా మారిందని, ఇప్పటికే ప్రెస్ అకాడమీ చైర్మన్ పదవి అనర్హులకు కేటాయించి జర్నలిస్టుల సమస్యలను నొక్కి పెట్టిన ప్రభుత్వం కనీసం అక్రిడేషన్ కార్డుల జారీలో కూడా నిబంధనలను గాలికి వదిలేసారన్న ఆరోపణలన్నింటినీ ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలి. గతంలో జారీ చేసిన కార్డుల అర్హతలు, విద్యార్హతల ధ్రువపత్రాలు, మీడియా సంస్థల వివరాలు, కమిటీ సిఫారసులు, తిరస్కరించిన దరఖాస్తుల కారణాలను ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి పరిశీలించాలి. అక్రమాలు నిర్ధారణ అయితే సంబంధిత డిపిఆర్ఓ లపై, కమిటీలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. అర్హులైన జర్నలిస్టులకు న్యాయం చేయాలని జర్నలిస్టు సంఘాలు కోరుతున్నాయి.

> **అక్రిడిటేషన్ కార్డు అనేది అమ్మకానికి పెట్టే వస్తువు కాదు. జర్నలిజం అర్హతకు, వృత్తిపరమైన గుర్తింపునకు ప్రతీక. ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించి, జర్నలిస్టుల విశ్వాసాన్ని నిలబెట్టాలి ఇలా డబ్బు పెట్టి కొనుక్కునే దుస్థితి తీసుకురాకూడదు అని జర్నలిస్టు సంఘాలు కోరుతున్నాయి.**

# ఢిల్లీ నిరసన మరో స్వాతంత్ర్య పోరాటం

**- ఎస్ఐఆర్ జరిగిన రాష్ట్రాల్లో బీజేపీ గెలిచింది**

- ఈడీ, సీబీఐ సరిపోక ఈసీని వాడుకుంటున్నారు
- కేంద్ర ప్రభుత్వం ఈసీని దుర్వినియోగం చేస్తోందన్న సీఎం రేవంత్
- ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పేరుతో బీజేపీ వ్యతిరేకుల ఓట్ల తొలగిస్తున్నారని ఆరోపణ
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఎస్ఐఆర్ ప్రక్రియ జరగని రాష్ట్రాల్లో బీజేపీ ఓడిపోగా, ఓట్లు తొలగించిన బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో గెలిచిందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఒకవైపు జనాభా పెరుగుతుంటే, మరోవైపు దేశంలో ఓటర్ల సంఖ్య ఎందుకు తగ్గుతుందని ప్రశ్నించారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో సైమన్ కమిషన్ భారత్‌కు వచ్చినప్పుడు సైమన్ గో బ్యాక్ అని దేశమంతా నినాదాలు చేసిందని, ప్రస్తుతం ఎస్ఐఆర్ పేరుతో ఓట్లు తొలగించడంతో జ్ఞానేశ్ కుమార్ గోబ్యాక్ అంటున్నారని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలు చేస్తున్నది మరో స్వాతంత్ర్య

2లో..

# సర్‌పై స్టే, అధికారులపై చర్య

**- సుప్రీంకోర్టుకు రాహుల్ గాంధీ అభ్యర్థనలు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) రాహుల్ గాంధీతో సహా ప్రతిపక్ష నాయకులు, వందలాది మంది మద్దతుదారులతో కలిసి, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ, ఎన్నికల్లో అవకతవకలపై మధ్యంతర స్టే కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ప్రతిపక్ష నేత సాయంత్రం సుప్రీంకోర్టుకు చేరుకోవడానికి గంట ముందే కాంగ్రెస్ న్యాయ బృందం ఎన్నికల సంఘం తీసుకున్న సర్, ఇతర నిర్ణయాలకు సంబంధించి పది రకాల అంశాలపై

2లో..

# ఆదర్శ నగరంగా తిరుపతి

- **తిరుపతిలో రూ.3222 కోట్ల విలువైన అభివృద్ధి పనులు**
- **వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన సీఎం చంద్రబాబు**
- **తిరుమల భక్తుల కోసం 'వెంకటాద్రి' నావిగేషన్ యాప్ ప్రారంభం**



అమరావతి (ప్రశ్న న్యూస్) తిరుమల శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఓ శుభవార్త అందించింది. కొండపైకి వచ్చే యాత్రికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా క్యూలైన్లు, వసతి గదులు, అన్నప్రసాద కేంద్రాలు వంటి ముఖ్యమైన ప్రదేశాలను సులభంగా చేరుకునేందుకు 'వెంకటాద్రి' పేరుతో ఒక నూతన నావిగేషన్ మొబైల్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ఈ యాప్‌ను ఆవిష్కరించారు. ఈ యాప్ ప్రత్యేకత ఏమిటంటే, కొండపై ఇంటర్నెట్ సిగ్నల్ లేకపోయినా ఆఫ్‌లైన్, జీపీఎస్ విధానంలో పనిచేస్తుంది. తెలుగుతో సహా ఐదు భాషల్లో అందుబాటులో ఉన్న ఈ యాప్‌లో, భక్తులకు మార్గనిర్దేశం చేసేందుకు ఏఐ ఆధారిత 'గోవింద' వాయిస్ అసిస్టెంట్ సదుపాయం కూడా ఉంది. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సిబ్బంది

2లో..

# త్వరలోనే కరువు మండలాల ప్రకటన

**- రబీలో వారి సాగు చెయ్యొద్దన్న డిప్యూటీ సీఎం భట్టి**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణా రాష్ట్ర రైతాంగానికి రైతు నేస్తం కార్యక్రమం ద్వారా ప్రభుత్వం కీలక సూచనలు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల రైతులతో రైతు వేదికల ద్వారా వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడిన మంత్రులు రైతులకు పలు కీలక సూచనలు చేశారు. ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా రబీ సీజన్‌లో రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వరి సాగు చేయవద్దని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా ఆయన, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సహా అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల్లోని రైతులు, అధికారులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు.ఈ సందర్భంగా తెలంగాణా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం వల్ల ఈ ఏడాది వర్షపాతం తగ్గి నీటి లభ్యత గణనీయంగా తగ్గుతుందని హెచ్చరించారు. కాబట్టి నీటిని పొదుపుగా వినియోగించాలని, బిందు సేద్యం ద్వారా పామ్ తోటలు, కూరగాయలు వంటి స్వల్పకాలిక పంటలను సాగు చేయాలని సూచించారు.

2లో..

# 106 మున్సిపాలిటీలకు రిజర్వేషన్లు ఖరారు

**- మహిళలకు అగ్రతాంబూలం**




అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీ స్థానిక సంస్థల ఎన్నికల ముంగిట రాష్ట్రంలోని 106 మున్సిపాలిటీల్లో చైర్మన్ పదవుల రిజర్వేషన్లు ఖరారు చేస్తూ అధికారులు జాబితాను రిలీజ్ చేశారు. ఈ కేటాయింపులో బీసీ వర్గాలకు పెద్దపీట వేయడంతో పాటు మహిళలకు ఏకంగా 50 స్థానాలు కేటాయించి అగ్రతాంబూలం అందించింది. అన్ని కేటగిరీల్లో కలపి మహిళలకు మొత్తం 50 చైర్మన్ స్థానాలు దక్కాయి. జనరల్ కేటగిరీ మహిళలకు 27 స్థానాలు

2లో..

# NO అంటే బ్యాంకు ఖాతా ఖాళీ

- **ఇది సైబర్ నేరగాళ్ల సరికొత్త ఆటో ఎగ్జిక్యూషన్ ఫైల్ అటాక్**
- **ఓటీపీ, లింకులు లేకుండానే జరుగుతున్న మోసం**
- **గుర్తుతెలియని నంబర్లను బ్లాక్ చేయాలని సూచించిన సజ్జనార్**



2లో..

# ఢిల్లీ నిరసన మరో స్వాతంత్య్ర పోరాటం

పోరాటమంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో జరుగుతున్న భారీ నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లిన రేవంత్ రెడ్డి ర్యాలీకి సంబంధించి పార్టీ శ్రేణులకు కీలక సూచనలు చేస్తూ ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు.రాహుల్ గాంధీ నాయకత్వంలో 'ఇండియా' కూటమి చేపట్టిన ఈ పోరాటం కేవలం ఒక సాధారణ రాజకీయ నిరసన కాదని, దేశ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి జరుగుతున్న మరో స్వాతంత్ర్యోద్యమంగా అభివర్ణించారు. తన అధికారం నిలబెట్టుకునేందుకు ప్రధాని మోదీ గతంలో ఈడీ, సీబీఐ, ఇన్‌కం ట్యాక్స్ విభాగాలను వినియోగించారని, ఇప్పుడు ఏకంగా ఎన్నికల కమిషన్‌ను వినియోగించుకుంటున్నారని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం ప్రతిపక్షాలకు మద్దతుగా ఉండే దళితులు, గిరిజనులు, యువత ఓట్లను లక్ష్యంగా చేసుకుని 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (ఎస్ఐఆర్) పేరుతో అక్రమంగా తొలగిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఈ ప్రక్రియలో కేంద్ర ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌ను పూర్తిగా దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. సీఈసీ ఏకపక్షంగా వ్యవహరించారని తోటి ఎన్నికల కమిషనర్లు చెబుతున్నా జ్ఞానేశ్ కుమార్‌ను మోదీ కొనసాగించడానికి కారణం ఏంటని ప్రశ్నించారు.

### సమన్వయం చేసుకోవడానికి కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఈ నిరసన ప్రదర్శనలో పార్టీ శ్రేణులు చాలా క్రమశిక్షణతో వ్యవహరించాలని ఆయన ఆదేశించారు. రాష్ట్ర మంత్రివర్గ సభ్యులు, ఎంపీలు, ఇతర ముఖ్య నేతలంతా తమకు కేటాయించిన బస్సుల్లోనే బారాకంబా ప్రాంతానికి చేరుకోవాలని సూచించారు. అక్కడి నుంచి సుప్రీంకోర్టు వైపు శాంతియుతంగా మార్చ్ నిర్వహించాలని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ ర్యాలీ సందర్భంగా ఏవైనా అవాంఛనీయ సంఘటనలు ఎదురైనా, లేదా నాయకులు అదుపులోకి తీసుకుంటే కనుక తక్షణమే సమాచారం అందించడానికి, సమన్వయం చేసుకోవడానికి ఒక ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

# సర్‌పై స్టే, అధికారులపై చర్య

చర్యలు తీసుకోవాలని కోరుతూ అత్యున్నత న్యాయస్థానంలో ఒక పిటిషన్‌ను దాఖలు చేసింది. సాయంత్రం 4:30 గంటల గడువులోగా రాహుల్ గాంధీ సుప్రీంకోర్టుకు చేరుకోలేకపోవడంతో ఈ పిటిషన్‌ను న్యాయవాది ఎస్. ప్రసన్న దాఖలు చేశారు.రాహుల్ గాంధీతో పాటు, కాంగ్రెస్ పార్టీ అధినేత మల్లికార్జున్ ఖర్గే, ప్రియాంక గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ, ఆర్జేడీకి చెందిన తేజస్వి యాదవ్‌తో సహా పలువురు నాయకులు సోమవారం ఇండియా కూటమి భారీ ర్యాలీలో పాల్గొన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఈ విషయం కోర్టు పరిధిలో ఉందని పేర్కొంటూ రాహుల్ గాంధీని కలవడానికి నిరాకరించారు. అయితే, కోర్టులో పిటిషన్ వేయాలని, మా తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని స్పష్టం చేశారు. దీంతో ప్రతిపక్ష నాయకులు సుప్రీంకోర్టులో సంయుక్తంగా పిటిషన్ దాఖలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలనేది ప్రతిపక్షం ప్రధాన డిమాండ్లలో ఒకటి.

### 1. ఎస్ఐఆర్ సంబంధిత అన్ని రికార్డులను సమర్పించాలని ఆదేశం

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)కు సంబంధించిన పూర్తి దస్త్రాలు, ఒప్పందాలు, సమావేశాల రికార్డులు (మినిట్స్), అభ్యంతరాల నమోదు పత్రాలను కోర్టుకు సమర్పించేలా భారత ఎన్నికల సంఘానికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి. జూన్ 24, 2025న ఎస్ఐఆర్ ప్రారంభానికి తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన పూర్తి ఫైల్ నోటింగ్స్, ఈసీనేట్, ఈఆర్‌ఓనేట్ లాగ్ వివరాలు ఇందులో చేర్చాలి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19, 21 కింద పౌరుల హక్కులను పరిరక్షించడానికి, ఆర్టికల్ 324ను సమర్థవంతంగా అమలు చేయడానికి ఈ ఆదేశం అవసరం.

### 2. ఎస్ఐఆర్ నిర్ణయాల రాజ్యాంగ చెల్లుబాటుపై విచారణ

ఎస్ఐఆర్‌కు సంబంధించిన వివాదాస్పద నిర్ణయాలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 324, 'చీఫ్ ఎలక్షన్ కమిషనర్ అండ్ అదర్ ఎలక్షన్ కమిషనర్స్ యాక్ట్, 2023' లోని సెక్షన్ 18, 'టి.ఎన్. శేషన్ వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1995)' కేసులో అత్యున్నత న్యాయస్థానం నిర్దేశించిన సూత్రాలకు అనుగుణంగా ఉన్నాయో లేదో విచారించడానికి తగిన ఉత్తర్వులు జారీ చేయాలి. చట్టబద్ధమైన అధికారాలు లేకుండా ఏవైనా నిర్ణయాలు తీసుకుని ఉంటే, వాటిని రద్దు చేయాలి.

### 3. బాధ్యులైన అధికారులపై చర్యలు

ఓటర్ల జాబితాల తయారీ, సవరణకు సంబంధించిన రాజ్యాంగ లేదా చట్టబద్ధ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై తగిన చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలి. అవసరమైన చోట ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1950 లోని సెక్షన్ 32 కింద కూడా చర్యలు చేపట్టాలి.

### 4. పిటిషనర్ ఫిర్యాదుల పరిష్కారం

ప్రస్తుత పిటిషన్, దానికి సంబంధించిన అంశాలపై ఎన్నికల సంఘం తగిన నిర్ణయం తీసుకునేలా, ఎస్ఐఆర్‌కు సంబంధించి ఈసీఐ తీసుకునే ప్రతి నిర్ణయం 2023 చట్టంలోని సెక్షన్ 18 కింద నమోదు అయ్యేలా సమగ్ర ఆదేశాలు ఇవ్వాలి.

### 5. ఆన్‌లైన్ ఫారమ్-6ను నిర్దేశిత నిబంధనలకు అనుగుణంగా మార్పు

ఆన్‌లైన్ ఫారమ్–6 'రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్, 1960' కింద నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా ఉండేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలి. వర్తించే ప్రక్రియను అనుసరించి నిబంధనలను సరిగ్గా సవరించకుండా, నిర్దేశిత ఫారమ్‌లో ఎలాంటి మార్పులు చేయకూడదు.

### 6. స్వతంత్ర కమిటీతో తనిఖీకి డిమాండ్

సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జ్ అధ్యక్షతన, సాంకేతిక నిపుణులు, ప్రముఖులతో కూడిన ఒక స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేయాలి. ఈ కమిటీకి నిర్దేశిత కాల పరిమితిలో ఈ కింది బాధ్యతలు అప్పగించాలి. ఎస్ఐఆర్ సమయంలో ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపు, సవరణలపై స్వతంత్ర విచారణ, ఆడిట్ నిర్వహించడం. ఈసీనేట్, ఈఆర్‌ఓనేట్లతో సహా ఓటర్ల జాబితా డేటాబేస్ యాక్సెస్, అందులో చేసిన మార్పులను సమగ్రంగా పరిశీలించడం. స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించే లక్ష్యంతో ఈవీఎంల రూపకల్పన, వినియోగం, విధానాలు, సాంకేతికతపై అంతర్జాతీయ ఉత్తమ విధానాలను పరిగణనలోకి తీసుకుని సమీక్షించడం.

### 7. సర్‌లో తొలగించిన ఓటర్ల పేర్లు, కారణాలను బహిర్గతం చేయడం

ఎస్ఐఆర్ సమయంలో ఓటర్ల జాబితా నుంచి తొలగించిన పౌరుల వివరాలను పోలింగ్ బూత్‌ల వారీగా ఎన్నికల సంఘం ప్రచురించేలా ఉత్తర్వులు ఇవ్వాలి. దీనితో పాటు ప్రతి ఓటరు పేరును తొలగించడానికి గల నిర్దిష్ట కారణాన్ని వెల్లడించాలి. తొలగించిన పేర్లను లింగం (జెండర్), వయస్సు ఆధారంగా వర్గీకరించాలి. అర్హత కలిగిన ఓటర్ల పేర్లను తిరిగి జాబితాలో చేర్చడానికి స్పష్టమైన, సమర్థవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

### 8. నోటీసు, విచారణ లేకుండా ఏ ఓటరు పేరును తొలగించకూడదు

చట్ట ప్రకారం ముందస్తు నోటీసు ఇవ్వకుండా, సరైన విచారణ అవకాశం కల్పించకుండా ఏ ఓటరు పేరును జాబితా నుంచి తొలగించవద్దని ప్రతివాదులను ఆదేశించాలి. అంతేకాకుండా, పంజాబ్, సహా త్వరలో ఎన్నికలు జరగనున్న ఇతర రాష్ట్రాల్లో, చట్టం నిర్దేశించిన ఆఖరి తేదీ వరకు అర్హులైన పౌరులు తమ పేర్లను నమోదు చేసుకోవడానికి అనుమతించాలి.

### 9. కొనసాగుతున్న సర్ ప్రక్రియపై తాత్కాలిక స్టే

ఈ పిటిషన్‌లో లేవనెత్తిన ప్రధాన అంశాలపై విచారణ పూర్తయి తీర్పు వచ్చే వరకు, అన్ని రాష్ట్రాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేస్తూ తాత్కాలిక స్టే ఉత్తర్వులు జారీ చేయాలి. అర్హులైన ఓటర్ల హక్కులను కాపాడటానికి, ఎన్నికల ప్రక్రియ విశ్వసనీయతను నిలబెట్టడానికి ఈ డిమాండ్ చేయబడింది.

### 10. కోర్టు భావించే ఇతర తగిన ఉత్తర్వుల జారీ

కేసు పరిస్థితులు, వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని, ఎన్నికల ప్రక్రియ పారదర్శకతను, ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడానికి కోర్టు అవసరమని భావించే ఇతర అదనపు ఉత్తర్వులను జారీ చేయాలని ప్రార్థిస్తున్నామని పేర్కొన్నారు.

# త్వరలోనే కరువు మండలాల ప్రకటన

ప్రత్యామ్నాయ పంటలను సాగు చేస్తే మంచిదని సలహా ఇచ్చారు. వరి వంటి నీటి అవసరం ఎక్కువైన పంటలు సాగు చేస్తే తాగునీటి సమస్య తీవ్రమవుతుందన్నారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, బోర్వెల్స్ రీఛార్జ్ వంటి పనులు చేపట్టి జలవనరులను కాపాడుకోవాలని కోరారు. రాష్ట్రంలో 315 మండలాల్లో వర్షపాతం తక్కువగా నమోదైందని, త్వరలోనే కరువు మండలాలను ప్రకటిస్తామని చెప్పారు. వచ్చే వర్షాకాలం నాటికి తాగునీటి సమస్యలు రాకుండా ఇప్పటి నుంచే నీటిని జాగ్రత్తగా వాడాలని సూచించారు.వ్యవసాయానికి విద్యుత్ సరఫరాపై సరైన ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. భూగర్భ జల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు గ్రౌండ్ వాటర్ లెవెల్ నివేదికలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వం రైతుల ప్రయోజనాలు, ప్రజా సంక్షేమం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. రైతులు ప్రభుత్వ సలహాలు పాటించి, నీటిని పొదుపుగా వినియోగిస్తే ఈ కష్టకాలం సులభంగా దాటవచ్చని ఆయన అన్నారు.

# ఆదర్శ నగరంగా తిరుపతి

లొకేషన్‌ను ట్రాక్ చేసే సౌకర్యం కల్పించారు. ఆపిల్ యాప్ స్టోర్, గూగుల్ ప్లే స్టోర్ల నుంచి దీనిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.ఈ వెంకటాద్రి యాప్‌ను ఆవిష్కరించిన సందర్భంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతి సమగ్రాభివృద్ధికి ఉద్దేశించిన మరిన్ని కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (తుడా), టీటీడీ సంయుక్తంగా చేపట్టనున్న రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులను సచివాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన తిరుపతిని ఒక ఆదర్శ ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

### అలిపిరి వద్ద సమీకృత యాత్రికుల టౌన్‌షిప్

ఈ అభివృద్ధి పనుల్లో అత్యంత కీలకమైనది అలిపిరి వద్ద ఎస్వీ జూపార్క్ రహదారిలో నిర్మించతలపెట్టిన సమీకృత యాత్రికుల టౌన్‌షిప్. దీని నిర్మాణానికి సుమారు రూ.2,750 కోట్లు వెచ్చించనున్నారు. తిరుమల కొండపై వసతుల ఒత్తిడి తగ్గించి, తిరుపతిలోనే భక్తులకు అన్ని సౌకర్యాలు ఒకేచోట కల్పించడం ఈ ప్రాజెక్టు ఉద్దేశం. ఇందులో భాగంగా రూ.1,332 కోట్లతో పది అంతస్తుల చొప్పున నాలుగు బ్లాకుల్లో 2,700 గదులను నిర్మించనున్నారు. దీని ద్వారా రోజుకు దాదాపు 16 వేల మందికి వసతి అందుబాటులోకి వస్తుంది. రూ.160 కోట్లతో నిర్మించే అన్నప్రసాద కేంద్రంలో ఒకేసారి 6 వేల మంది భోజనం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వాహనాల పార్కింగ్ సమస్య పరిష్కారానికి రూ.311 కోట్లతో 4,500 వాహనాలు నిలిపేలా బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయాన్ని, రూ.90 కోట్లతో సమీకృత రవాణా టెర్మినల్‌ను నిర్మించనున్నారు.

### మౌలిక సదుపాయాల విస్తరణ

తిరుపతి నగరంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ.242 కోట్ల వ్యయంతో 20 కిలోమీటర్ల పొడవున తొమ్మిది మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణ పనులను కూడా ప్రారంభించారు. ఈ రహదారులు జాతీయ రహదారుల మధ్య అనుసంధానాన్ని మెరుగుపరచడంతో పాటు, తిరుచానూరు అమ్మవారి ఆలయానికి వెళ్లే భక్తులకు సౌకర్యవంతంగా ఉంటాయి.
శ్రీవారి సేవలో నిరంతరం పనిచేసే టీటీడీ ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని సీఎం తెలిపారు. ఇందులో భాగంగా 418 ఎకరాల్లో 5,192 మంది ఉద్యోగులకు ఇళ్ల స్థలాల లేఔట్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఈ లేఔట్లలో అంతర్గత రహదారులు, డ్రైనేజీ, మంచినీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పనకు రూ.230 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఉద్యోగుల కుటుంబాలు సంతోషంగా ఉంటే, వారు మరింత అంకితభావంతో భక్తులకు సేవలందిస్తారని సీఎం అన్నారు.

### సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

తిరుమల తరహా పవిత్రతను తిరుపతిలోనూ తీసుకురావాలని సీఎం అధికారులను ఆదేశించారు. తిరుపతిని కేవలం యాత్రా కేంద్రంగా కాకుండా ఆధ్యాత్మికత, పర్యావరణం, సాంకేతికత, విద్య, ఉపాధి, పర్యాటకంగా సమన్వయంతో అభివృద్ధి చేయాలన్నారు. నగరంలోని చెరువులను అనుసంధానించి సుందరీకరించాలని, 'వృక్షో గోవింద' కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేయాలని సూచించారు. మెరుగైన మౌలిక సదుపాయాలతో తిరుపతిని వివాహ వేడుకలకు, జాతీయ, అంతర్జాతీయ సదస్సులకు కేంద్రంగా మార్చాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ఎం.రవిచంద్ర, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, తిరుపతి జిల్లా కలెక్టర్, తుడా అధికారులు వర్చువల్‌గా పాల్గొన్నారు.

# NO అంటే బ్యాంకు ఖాతా ఖాళీ

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రోజురోజుకూ సైబర్ నేరాలు పెరిగిపోతున్న నేపథ్యంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ కీలక సూచనలు చేశారు. వాట్సాప్ మెసేజ్‌ల విషయంలో చాలా అలర్ట్‌గా ఉండాలని హెచ్చరించారు. బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు డెబిట్ అయినట్లు నమ్మించే సందేశాలతో సైబర్ నేరగాళ్లు ప్రజలను భయపెట్టి మోసాలకు పాల్పడే ప్రమాదం ఉందని సూచించారు. ముఖ్యంగా గుర్తుతెలియని నంబర్ల నుంచి వచ్చే సందేశాలకు తొందరపడి స్పందించవద్దని డబ్బులు పోయినట్లు అనుమానం కలిగితే వాట్సాప్ మెసేజ్‌ను నమ్మకుండా అధికారిక బ్యాంకింగ్ మార్గాల ద్వారా వివరాలు తనిఖీ చేసుకోవాలని స్పష్టం చేశారు.సైబర్ మోసగాళ్లు బాధితులను లక్ష్యంగా చేసుకునేందుకు భయాందోళనలను ఉపయోగించుకుంటున్నారని మీ బ్యాంకు అకౌంట్ నుంచి కొంత మొత్తం డెబిట్ అయిందని ఆ ట్రాన్సాక్షన్ మీరు చేయకపోతే వెంటనే స్పందించాలని చెప్పే మెసేజ్‌లు పంపించే అవకాశం ఉందని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. కొన్నిసార్లు 'ఎస్' లేదా 'నో' అని సమాధానం ఇవ్వాలని కోరుతూ బాధితులను గందరగోళానికి గురిచేస్తారని సూచించారు. అకౌంట్లో డబ్బులు పోయాయనే ఆందోళనతో కొందరు ఆ మెసేజ్‌లో సూచించినట్లు పాటించే ప్రమాదం ఉందని ఇలాంటి సందర్భాల్లో నేరగాళ్లు పంపే లింకులు, ఫైళు,, నకిలీ వెబ్‌సైట్లు, తదుపరి ఫోన్ కాల్స్ ద్వారా పర్సనల్ డేటాను సేకరించేందుకు ప్రయత్నించవచ్చని తెలిపారు. అందువల్ల ఆ మెసేజ్ నిజమైందో కాదో నిర్ధారించుకోకుండా స్పందించడం ప్రమాదకరమని పేర్కొన్నారు.'నో' అంటే బ్యాంకు ఖాతా ఖాళీ అవుతుంది. ఓటీపీలు అడగరని, లింకులు నొక్కక్కర్లేదు. వాట్సాప్ సందేశంతోనే క్షణాల్లో సొమ్ము స్వాహా. ఆటో ఎగ్జిక్యూషన్ ఫైల్ అటాక్‌తో కేటుగాళ్ల సరికొత్త పన్నాగం. వాట్సాప్‌లో వచ్చిన ఒకే ఒక్క సందేశానికి కేవలం 'నో' అని రిప్లై ఇచ్చినందుకే ఒకరి బ్యాంక్ ఖాతా క్షణాల్లో నిలువునా ఖాళీ అయిపోయింది. బాధితుడు ఎవరికీ ఎలాంటి ఓటీపీ చెప్పలేదు ఏ అనుమానాస్పద లింక్‌పైనా క్లిక్ చేయలేదు కేవలం 'నో' అనే రెండక్షరాల సమాధానమే జీవితకాల సంపాదనను తుడిచిపెట్టేసింది. ఇటీవల ఒక చార్టర్డ్ అకౌంటెంట్‌ను సైతం నిలువునా ముంచేసిన ఈ సరికొత్త సైబర్ నేరం నా దృష్టికి వచ్చింది. సాంకేతికతను ఆసరాగా చేసుకుని సైబర్ కేటుగాళ్లు పన్నిన అత్యంత ప్రమాదకరమైన ఆటో ఎగ్జిక్యూషన్ ఫైల్ అటాక్ ఇది' అని సజ్జనార్ ట్వీట్ చేశారు.'ఈ మోసం ఎలా జరుగుతోందంటే మొదట గుర్తుతెలియని నంబర్ నుంచి మీ వాట్సాప్‌కు 'మీ ఖాతా నుంచి ఇంత మొత్తం డెబిట్ అయ్యింది' అంటూ నకిలీ సందేశం వస్తుంది. ఆ వెంటనే మిమ్మల్ని తీవ్ర భయాందోళనకు గురిచేస్తూ 'ఈ లావాదేవీ మీరు చేయకపోతే వెంటనే నో అని రిప్లై ఇవ్వండి' అంటూ రెండో మెసేజ్ పంపుతారు. ఖాతాలో డబ్బులు పోయాయన్న కంగారుతో మీరు 'నో' అని టైప్ చేసి పంపిన మరుక్షణమే ఆ సందేశంలో కనిపించకుండా దాగి ఉన్న మాల్‌వేర్ (స్క్రిప్ట్) ఆటోమేటిక్‌గా యాక్టివేట్ అవుతాయి. క్షణాల్లో మీ మొబైల్ ఫోన్‌పై పూర్తి నియంత్రణను హ్యాకర్లు చేజిక్కించుకుని, బ్యాంక్ ఖాతాల్లోని సొమ్మంతటినీ ఊడ్చేస్తారు' ట్వీట్‌లో సజ్జనార్ పేర్కొన్నారు.'అందుకే ప్రజలందరికీ విజ్ఞప్తి ఏంటంటే గుర్తుతెలియని నంబర్ల నుంచి బ్యాంక్ లావాదేవీల పేరుతో వచ్చే మెసేజ్‌లకు 'ఎస్' గానీ, 'నో' గానీ ఎట్టిపరిస్థితుల్లోనూ రిప్లై ఇవ్వకండి. కంగారుపడి ఎలాంటి సమాధానమూ పంపకుండా వెంటనే ఆ నంబర్‌ను బ్లాక్ చేసి చాట్‌ను డిలీట్ చేయండి. మీ ఖాతాలో డబ్బు కట్ అయిందో లేదో తెలుసుకోవడానికి మీ అధికారిక బ్యాంక్ యాప్‌లోకి వెళ్లి నేరుగా చెక్ చేసుకోండి తప్ప, వాట్సాప్ సందేశాలను అస్సలు నమ్మకండి. ఏ అధికారిక బ్యాంకూ వాట్సాప్‌లో ఇలా సమాధానాలు కోరదు. ఒకవేళ ఎవరైనా ఈ మోసానికి గురైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా గోల్డెన్ అవర్‌లో వెంటనే '1930' సైబర్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయండి లేదా ఆన్లైన్ లో ఫిర్యాదు చేయండి. కంగారులో ఇచ్చే ఒక్క నో అనే సందేశం మీ సర్వస్వాన్నీ తుడిచిపెట్టేస్తుంది తస్మాత్ జాగ్రత్త' అని సజ్జనార్ హితవు పలికారు.

# ఆరు రాష్ట్రాలకు నూతన గవర్నర్లు

## – రాష్ట్రపతి ముర్ము ఉత్తర్వులు



**న్యూఢిల్లీ** దేశంలోని ఆరు రాష్ట్రాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం నూతన గవర్నర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మార్పుల ప్రకారం కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఒడిశా, ఉత్తరాఖండ్, సిక్కిం రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు బాధ్యతలు చేపట్టనున్నారు. కొందరిని బదిలీ చేయగా, మరికొందరిని కొత్తగా నియమించారు. వివరాల్లోకి వెళితే, ప్రస్తుతం సిక్కిం గవర్నర్‌గా ఉన్న ఓం ప్రకాశ్ మాథుర్‌ను కేరళ నూతన గవర్నర్‌గా నియమించారు. ఇప్పటివరకు కేరళ గవర్నర్‌గా పనిచేసిన రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను తమిళనాడు గవర్నర్‌గా బదిలీ చేశారు. ఇక, కర్ణాటక కొత్త గవర్నర్‌గా డాక్టర్ సుధా యాదవ్‌ను నియమిస్తూ రాష్ట్రపతి భవన్ నిర్ణయం తీసుకుంది.ఇక ఇతర రాష్ట్రాల విషయానికొస్తే, ఒడిశా గవర్నర్‌గా బ్రజ్ మోహన్ రామ్, ఉత్తరాఖండ్ గవర్నర్‌గా డాక్టర్ ధల్ సింగ్ బిసెన్‌ను నియమించారు. ఓం ప్రకాశ్ మాథుర్ కేరళకు బదిలీ కావడంతో, ఖాళీ అయిన సిక్కిం గవర్నర్ పదవిలో దుష్యంత్ గౌతమ్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్రపతి భవన్ తన ప్రకటనలో పేర్కొంది. ఈ నియామకాలన్నీ సంబంధిత వ్యక్తులు తమ కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి తక్షణమే అమల్లోకి వస్తాయని రాష్ట్రపతి కార్యాలయం జారీ చేసిన ప్రకటనలో స్పష్టం చేసింది.

# 106 మున్సిపాలిటీలకు రిజర్వేషన్లు ఖరారు

కేటాయించగా, బీసీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరీల్లో మహిళలకు కలిపి మరో 23 స్థానాలు రిజర్వ్ అయ్యాయి. అలాగే వెనుకబడిన తరగతులకు అంటే బీసీలకు అత్యధికంగా 36 స్థానాలు దక్కాయి. అందులో బీసీ మహిళలకు 14, బీసీ జనరల్ 22 స్థానాలు కేటాయించబడ్డాయి. ఎస్సీ వర్గానికి 14 స్థానాలు (మహిళలకు 7, జనరల్ 7), ఎస్టీ వర్గానికి మూడు స్థానాలు (మహిళలకు 1, జనరల్ 2) కేటాయించారు. అదేవిధంగా ఎలాంటి రిజర్వేషన్ లేని ఓపెన్ కేటగిరీ కింద 26 మున్సిపాలిటీలు ఉన్నాయి. దీంతో ప్రధాన రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించాయి.

### కేటగిరీల వారీగా పూర్తి లిస్ట్...

తొలుత ఎస్టీ కేటగిరీ కింద మూడు స్థానాలు కేటాయించారు.
ఎస్టీ – మహిళ (1): గూడూరు
ఎస్టీ – జనరల్ (2): ఆత్మకూరు, ఆలూరు
ఎస్సీ కేటగిరీ కింద 14 స్థానాలు...
ఎస్సీ – మహిళ (7): కొండపల్లి, నిడదవోలు, యలమంచిలి, చింతలపూడి, సూళ్లూరుపేట, గుత్తి, చీరాల.
ఎస్సీ – జనరల్ (7): ఉయ్యూరు, నూజివీడు, కుప్పం, సామర్లకోట, పిఠాపురం, బాపట్ల, పొదిలి.

### బీజ కేటగిరీ కింద మొత్తం 36

బీసీ – మహిళ (14): జంగారెడ్డిగూడెం, నాయుడుపేట, నర్సీపట్నం, చిలకలూరిపేట, ఇచ్ఛాపురం, పాలకొల్లు, కొవ్వూరు, గుంతకల్, గుడివాడ, నందిగామ, ముమ్మిడివరం, మదనపల్లె, నరసరావుపేట, అమలాపురం.బీసీ – జనరల్ (22): కావలి, కదిరి, బి.కొత్తకోట, కందుకూరు, ఆత్మకూరు (నెల్లూరు), హిందూపురం, కమలాపురం, అద్దంకి, నెల్లిమర్ల, మడకశిర, ఆళ్లగడ్డ, గురజాల, దాచేపల్లి, గొల్లప్రోలు, మార్కాపురం, బేతంచెర్ల, నందికొట్కూరు, నంద్యాల, దర్శి, గూడూరు (కర్నూలు), మైదుకూరు, బద్వేల్.

### జనరల్ కేటగిరీ - మహిళ 27 స్థానాలు

కనిగిరి, వెంకటగిరి, పలాస–కాశీబుగ్గ, నరసాపురం, పెడన, పలమనేరు, జమ్మలమడుగు, పొన్నూరు, ఆకివీడు, పాలకొండ, భీమవరం, జగ్గయ్యపేట, బుచ్చిరెడ్డిపాలెం, యర్రగుంట్ల, కళ్యాణదుర్గ్, ఆమదాలవలస, పుంగనూరు, మాచర్ల, రాజంపేట, ఆదోని, డోన్, రాజాం, బొబ్బిలి, రేపల్లె, పులివెందుల, ఎమ్మిగనూరు (యలమంచిలి టౌన్).

### అన్‌రిజర్వ్ - జనరల్ మొత్తం 26 స్థానాలు

పుట్టపర్తి, పెనుకొండ, రాయచోటి, సాలూరు, తణుకు, తాడేపల్లిగూడెం, రామచంద్రాపురం, తెనాలి, శ్రీకాళహస్తి, తుని, సత్తెనపల్లె, పార్వతీపురం, ప్రొద్దుటూరు, పుత్తూరు, మండపేట, నగరి, చీమకుర్తి, తిరువూరు, రాయదుర్గ్, గిద్దలూరు, వినుకొండ, పెద్దాపురం, ధర్మవరం, తాడిపత్రి, పిడుగురాళ్ల.ఏపీలో రిజర్వేషన్ల ప్రక్రియ కొలిక్కి రావడంతో త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. నోటిఫికేషన్ 14వతేదీన రిలీజ్ అయ్యే ఛాన్స్ కనిపిస్తుంది. దీంతో అభ్యర్థుల ఎంపిక, సీట్ల కేటాయింపుపై అన్ని పార్టీలు ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించాయి.

# ప్రజల దాహం కంటే బీర్లే ముఖ్యమా?

## – ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కోట్ల మంది ప్రజల తాగునీటి అవసరాలను పక్కనపెట్టి, బీర్ ఫ్యాక్టరీలకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన ప్రభుత్వం నీటి, విద్యుత్ నిర్వహణలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. సింగూరు ప్రాజెక్టు అంశాన్ని హరీశ్ రావు ప్రత్యేకంగా ప్రస్తావించారు. మరమ్మతుల పేరుతో ప్రాజెక్టు నుంచి 29 టీఎంసీల నీటిని ఖాళీ చేసి, పనులను అసంపూర్తిగా వదిలేశారని విమర్శించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో కేవలం 3 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉన్నా, దానిని బీర్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారని ఆరోపించారు. ఈ చర్య వల్ల హైదరాబాద్, రంగారెడ్డి, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాల ప్రజల తాగునీటి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఫల్యాల వల్లే రాష్ట్రంలో కరెంట్ కోతలు పెరిగాయని, ప్రభుత్వ విధానాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని హరీశ్ రావు అన్నారు. ఎల్ నినో ప్రభావంపై ముందుగానే హెచ్చరికలు ఉన్నప్పటికీ, దేవాదుల, కల్వకుర్తి వద్ద నీటిని లిఫ్ట్ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని, ఇది కృత్రిమ కరవుకు దారితీసిందని దుయ్యబట్టారు. మద్యం కంపెనీలకు నీటి కొరత రాకూడదని ఎక్సైజ్ మంత్రి వ్యాఖ్యానించడాన్ని ఆయన తప్పుపట్టారు.

# ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతి 2026

## – రాబర్ట్ హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌కు పురస్కారం




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఆర్థిక శాస్త్రంలో 2026 నోబెల్ బహుమతిని అమెరికా ఆర్థికవేత్తలు రాబర్ట్ ఈ. హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌కు ప్రకటించారు. స్థూల ఆర్థిక వ్యవస్థలో ఒడుదొడుకులను నియంత్రించేందుకు ఉపయోగపడే నమూనాల రూపకల్పనకు అవసరమైన సూక్ష్మ ఆర్థిక పునాదులపై వారు చేసిన పరిశోధనకు ఈ పురస్కారం దక్కింది. స్టాక్‌హోమ్‌లోని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సోమవారం ఈ విషయాన్ని ప్రకటించింది. రాబర్ట్ ఈ. హాల్ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. మైఖేల్ వుడ్‌ఫోర్డ్ కొలంబియా యూనివర్సిటీలో రాజకీయ ఆర్థికశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా ఉన్నారు. వీరి పరిశోధనలు ఆర్థిక వ్యవస్థలో వృద్ధి, మాంద్యం వంటి పరిస్థితులను ప్రభుత్వాలు, కేంద్ర బ్యాంకులు మరింత సమర్థంగా ఎదుర్కొనేందుకు తోడ్పడతాయి. ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకునే మార్పులను అర్థం చేసుకుని తగిన విధాన నిర్ణయాలు తీసుకోవడంలో ఈ అధ్యయనాలు కీలకంగా నిలుస్తాయి.
ఆర్థిక శాస్త్రంలో ఈ పురస్కారాన్ని అధికారికంగా 'ఆల్ఫ్రెడ్ నోబెల్ స్మారకార్థం స్వెరిజెస్ రిక్స్‌బ్యాంక్ ఆర్థిక శాస్త్ర బహుమతి' అని పిలుస్తారు. స్వీడన్ కేంద్ర బ్యాంకు 1968లో దీన్ని ఏర్పాటు చేసింది. 1969లో తొలిసారిగా ప్రదానం చేశారు. ఆల్ఫ్రెడ్ నోబెల్ తన వీలునామాలో పేర్కొన్న అసలు ఐదు నోబెల్ బహుమతుల్లో ఆర్థిక శాస్త్ర పురస్కారం లేదు. అయినప్పటికీ మిగతా నోబెల్ పురస్కారాలతో పాటే ఏటా డిసెంబర్ 10న దీన్ని అందజేస్తారు. 1896లో అదే రోజున నోబెల్ మరణించారు. 2025లో ఈ బహుమతి జోయెల్ మోకిర్, ఫిలిప్ అఘియోన్, పీటర్ హోవిట్‌లకు లభించింది. సాంకేతిక పురోగతి, నూతన ఆవిష్కరణలు దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి ఎలా దోహదపడతాయో వివరించినందుకు వారిని ఎంపిక చేశారు.

# శ్రీశైలాభివృద్ధికి సత్రాల యాజమాన్యాలు సహకరించాలి

**భక్తులకు మెరుగైన వసతి, భోజన సదుపాయాలు కల్పించాలి**

**పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి..**

**సమన్వయ కమిటీ ఏర్పాటుకు ప్రతిపాదన**



శ్రీశైలం(ప్రశ్న న్యూస్) శ్రీశైల మహాక్షేత్రానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు దేవస్థానం, ప్రైవేటు సత్రాల యాజమాన్యాలు సమన్వయంతో పనిచేయాలని ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు పిలుపునిచ్చారు. క్షేత్రానికి విచ్చేసే ప్రతి భక్తుడినీ అతిథిగా భావించి, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన వసతి, భోజన సదుపాయాలు కల్పించాలని సూచించారు. క్షేత్ర పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని కోరారు.
శ్రీశైల దేవస్థానం కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం దేవస్థానం పరిధిలోని ప్రైవేటు సత్రాల యాజమాన్యాలతో ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి శ్రీశైలానికి వచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. దేవస్థానం అభివృద్ధికి సత్రాల యాజమాన్యాలు సహకరించాలని కోరారు.

### తిరుమల స్థాయిలో అభివృద్ధికి కృషి

కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ శ్రీశైల మహాక్షేత్రాన్ని తిరుమల స్థాయిలో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందన్నారు. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను దేవస్థానం దశలవారీగా కల్పిస్తోందని తెలిపారు. సత్రాల యాజమాన్యాలు సేవా దృక్పథంతో ముందుకొచ్చి క్షేత్రాభివృద్ధికి తోడ్పడాలని కోరారు.
ధర్మకర్తల మండలి సభ్యుడు చిలువేరు కాశినాథ్ మాట్లాడుతూ పలు సత్రాలు అన్నదాన సేవతోపాటు భక్తులకు వసతి సౌకర్యాలు కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సేవలను మరింత విస్తరిస్తూ దేవస్థానం అభివృద్ధిలో అన్ని సత్రాల యాజమాన్యాలు భాగస్వాములు కావాలని సూచించారు. మరో సభ్యుడు దేవకి వేంకటేశ్వర్లు సత్రాల యాజమాన్యాలు అందిస్తున్న సేవలను కొనియాడారు.

### సమన్వయ కమిటీ ఏర్పాటుకు సూచన

ధర్మకర్తల మండలి సభ్యుడు చిట్టిబొట్ల భరద్వాజశర్మ మాట్లాడుతూ దేవస్థానం అధికారులు, సత్రాల ప్రతినిధులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేసి అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో పాల్గొన్న సత్రాల నిర్వాహకులు తమ అభిప్రాయాలు, సూచనలను తెలియజేశారు. ఇలాంటి సమావేశాలను తరచూ నిర్వహించాలని కోరుతూ, క్షేత్రాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.అనంతరం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు, కార్యనిర్వహణాధికారి, సభ్యులను సత్రాల యాజమాన్యాల ప్రతినిధులు సత్కరించారు. సమావేశంలో దేవస్థానం రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఖమ్మంలో శ్రీవారి ఆలయానికి భూమిపూజ

**వేద మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా శంకుస్థాపన**

**ప్రహరీ నిర్మాణానికి టీటీడీ రూ.3.40 కోట్లు మంజూరు**

**ప్రధాన ఆలయంతోపాటు ఉపాలయాలు, రాజగోపురం నిర్మాణం**




ఖమ్మం(ప్రశ్న న్యూస్) కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయ నిర్మాణానికి ఖమ్మంలో సోమవారం శ్రీకారం చుట్టారు. తెలంగాణలోని ఖమ్మం అర్బన్ మండలం దరుసులాపురం రెవెన్యూ గ్రామ పరిధిలో నిర్మించనున్న శ్రీవారి దివ్యక్షేత్రానికి త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భూమిపూజ నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ ఆగమ శాస్త్ర సంప్రదాయాల ప్రకారం పూజా కార్యక్రమాలు జరిపారు. అనంతరం ఆలయ నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.ఖమ్మం ప్రాంత భక్తులకు శ్రీవారి దర్శన భాగ్యాన్ని చేరువ చేయడంతోపాటు సనాతన ధర్మ ప్రచారాన్ని విస్తృతం చేయాలనే లక్ష్యంతో టీటీడీ ఈ ఆలయాన్ని నిర్మించనుంది. ఇందుకోసం తెలంగాణ ప్రభుత్వం ఖమ్మం అర్బన్ మండలం దరుసులాపురం రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబరు 408/2లో 20.04 సెంట్ల భూమిని కేటాయించింది. ఆలయ స్థలానికి రక్షణగా ప్రహరీ గోడ నిర్మాణానికి టీటీడీ రూ.3.40 కోట్లు మంజూరు చేసింది. ప్రధాన ఆలయ నిర్మాణ పనులను కూడా టీటీడీ చేపట్టనుంది.

### ప్రధాన ఆలయంతోపాటు ఉపాలయాలు

శ్రీవారి ప్రధాన ఆలయంతోపాటు ఉపాలయాలు, రాజగోపురం, పోటు (వంటశాల), ప్రాకారం తదితర నిర్మాణాలను చేపట్టనున్నారు. ఆలయం పూర్తయితే ఖమ్మం పరిసర ప్రాంతాల భక్తులకు శ్రీవారి దర్శనం మరింత చేరువ కానుంది. ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ధార్మిక ప్రచారానికి ఈ క్షేత్రం కేంద్రంగా నిలవనుంది.

### రెండు తెలుగు రాష్ట్రాలకు ఆధ్యాత్మిక వారధి

చిన్నజీయర్ స్వామి మాట్లాడుతూ ఖమ్మం నగరం రెండు తెలుగు రాష్ట్రాలను ఆధ్యాత్మికంగా అనుసంధానించే కేంద్రంగా ఎదగాలని ఆకాంక్షించారు. శ్రీనివాసుడి కుటుంబ సభ్యులుగా భావించి ప్రతి ఒక్కరూ ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజలకు అరిష్టాలు తొలగి, పాడిపంటలతో పల్లెలు సుభిక్షంగా వర్ధిల్లాలని ఆశీర్వదించారు. భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణం పూర్తై ఖమ్మం ఆధ్యాత్మిక వైభవానికి చిరునామాగా నిలవాలని అన్నారు.
టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా శ్రీవారి ఆలయాల నిర్మాణానికి టీటీడీ కృషి చేస్తోందన్నారు. హిందూ ధర్మం, సనాతన సంప్రదాయాల పరిరక్షణలో ఆలయాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఖమ్మం ఆలయ నిర్మాణంలో స్థానిక భక్తులు భాగస్వాములు కావాలని, విరాళాల ద్వారా సహకరించాలని కోరారు.

# శ్రీశైలాభివృద్ధికి రూ.188 కోట్లతో క్యూ కాంప్లెక్స్

**- ధర్మకర్తల మండలి ఏడాది ప్రగతి నివేదిక వెల్లడి 30 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్**

**- 20 చోట్ల రూ.7.5 కోట్లతో మరుగుదొడ్ల సముదాయాలు.. - 108 అడుగుల అర్ధనారీశ్వర విగ్రహం**



శ్రీశైలం(ప్రశ్న న్యూస్) శ్రీశైల మహాక్షేత్ర అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనే లక్ష్యంగా ధర్మకర్తల మండలి ఏడాది కాలంలో పలు కీలక నిర్ణయాలు తీసుకుందని మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు తెలిపారు. భవిష్యత్తులో 30 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మాస్టర్‌ప్లాన్‌ను ఆమోదించామని, పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా సుమారు రూ.188 కోట్ల అంచనా వ్యయంతో క్యూ కాంప్లెక్స్ నిర్మాణానికి తీర్మానించామని వెల్లడించారు. సామాన్య భక్తులకు ప్రాధాన్యమిస్తూ వసతి, పార్కింగ్, శౌచాలయాలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టినట్లు వివరించారు.గత ఏడాది అక్టోబరు 13న ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం చేసిందని, ఈ సందర్భంగా సోమవారం సభ్యులు చిట్టిబొట్ల భరద్వాజశర్మ, దేవకి వేంకటేశ్వర్లు, చిలువేరు కాశినాథ్‌లతో కలిసి ఏడాది ప్రగతిని అధ్యక్షుడు వివరించారు. మండలి సభ్యులతోపాటు కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, అర్చకులు, వేదపండితులు, అధికారులు, సిబ్బంది సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు.

### 295 అంశాలపై చర్చ.. 242 ఆమోదం

ఏడాది కాలంలో నిర్వహించిన సమావేశాల్లో మొత్తం 295 అజెండా అంశాలపై చర్చించినట్లు అధ్యక్షుడు తెలిపారు. వీటిలో 242 అంశాలకు ఆమోదం లభించిందని, 38 అంశాలను వాయిదా వేయగా, మరో 15 అంశాలను తిరస్కరించినట్లు వివరించారు. ఆలయ పాలనలో ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని నిర్ణయించామని, సీసీ కెమెరాలను కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతతో అనుసంధానించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. దీని ద్వారా భక్తులు, వాహనాల రద్దీని క్రమబద్ధీకరించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు.

### భవిష్యత్తు అవసరాలకు మాస్టర్‌ప్లాన్

రాబోయే మూడు దశాబ్దాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌లో సామాన్య భక్తుల సౌకర్యాలకు తొలి ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. డార్మిటరీలు, శౌచాలయాలు, వాహనాల పార్కింగ్ ప్రదేశాల నిర్మాణంతోపాటు క్షేత్రాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దే నిర్మాణాలు, పర్యావరణ పరిరక్షణ, సుందరీకరణకు సంబంధించిన అంశాలను అందులో చేర్చినట్లు వివరించారు.
తిరుమలలోని పబ్లిక్ అమినిటీస్ కాంప్లెక్స్ తరహాలో శ్రీశైలంలోనూ భక్తుల కోసం ప్రత్యేక సముదాయాన్ని నిర్మించేందుకు తీర్మానించారు. నక్షత్రవనం సమీపంలో 108 అడుగుల అర్ధనారీశ్వర విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వైదిక, శిల్పరంగ నిపుణుల సూచనలతో విగ్రహ రూపకల్పన చేపట్టనున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీగోకులాన్ని సంప్రదాయబద్ధంగా, కళాత్మకంగా ఆధునికీకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

### 20 చోట్ల శౌచాలయాలు

భక్తుల సౌకర్యార్థం క్షేత్ర పరిధిలోని 20 ప్రాంతాల్లో సుమారు రూ.7.5 కోట్లతో శౌచాలయ సముదాయాలను నిర్మించేందుకు చర్యలు చేపట్టినట్లు అధ్యక్షుడు వెల్లడించారు. శౌచాలయాలు, స్నానపు గదులను ఉచితంగా వినియోగించుకునే విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. హాటకేశ్వరం వద్ద దేవస్థాన స్థలంలో విశాలమైన పార్కింగ్ ప్రదేశాన్ని ఏర్పాటు చేయడంతోపాటు అక్కడ శౌచాలయాలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిర్ణయించారు. ఆరుబయలు ప్రాంతాలు, పార్కింగ్ ప్రదేశాల్లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

### చెంచు భక్తులకు స్పర్శదర్శనం

స్థానిక చెంచు గిరిజనులకు నెలలో చివరి బుధవారం ఉచితంగా శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల స్పర్శదర్శనం కల్పిస్తున్నట్లు తెలిపారు. గత డిసెంబరు 1 నుంచి స్పర్శదర్శనం, అతిశీఘ్రదర్శనం భక్తులకు ఉచిత లడ్డూ ప్రసాదాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రూ.500 రుసుముతో స్పర్శదర్శనం చేసుకునే భక్తులకు 100 గ్రాముల రెండు లడ్డూలు, రూ.300 రుసుముతో అతిశీఘ్రదర్శనం చేసుకునే వారికి ఒక లడ్డూ అందిస్తున్నట్లు వివరించారు.

### అనుబంధ ఆలయాల అభివృద్ధి

దేవస్థానం దత్తత ఆలయమైన కొలనుభారతి అమ్మవారి ఆలయంలో రూ.3.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు తీర్మానించినట్లు తెలిపారు. దేవస్థానం నిర్వహణలోని జ్యోతిస్సిద్ధవట ఆలయాన్ని దశలవారీగా అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. సిద్ధవట ఆలయంలో ఆగస్టు 29 నుంచి 31 వరకు నూతన ధ్వజప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు. రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ ఆగస్టులో ఐదు రోజులపాటు వరుణయాగం, సహస్రఘటాభిషేకం నిర్వహించినట్లు తెలిపారు. లోకకల్యాణం కోసం ఈ ఏడాది శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో తొలిసారిగా సహస్ర చండీ పారాయణ సహిత శతచండీ మహారుద్రయాగాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

# కోర్టు ఉత్తర్వులు బేఖాతరు

**ఎల్లంపేటలో అక్రమ నిర్మాణంపై చర్యలేవీ ?**

**కూల్చివేయాలని లోకాయుక్త ఆదేశించినా**

**మొక్కుబడి సీజింగ్‌తో చేతులు దులుపుకున్న వైనం**

**ఉన్నతాధికారులకు టీమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ రాష్ట్ర అధ్యక్షుడు తలారి చందర్ ఫిర్యాదు**

మేడ్చల్ ( ప్రశ్న న్యూస్ ) ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలో యథేచ్ఛగా సాగుతున్న భారీ అక్రమ నిర్మాణాన్ని ఉపేక్షిస్తూ, ఏకంగా న్యాయస్థాన ఆదేశాలనే అధికారులు తుంగలో తొక్కుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ కట్టడాన్ని తొలగించాలని లోకాయుక్త స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, పురపాలక అధికారులు మొక్కుబడిగా కాగితాలకే పరిమితమై చర్యలు తీసుకుంటూ అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారని 'టీమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సొసైటీ' రాష్ట్ర అధ్యక్షుడు సీడీఎంఏ (పురపాలక అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ డైరెక్టర్) కార్యాలయానికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

### కూల్చివేతకు బదులు కాగితాల్లోనే సీజ్

ఎల్లంపేట గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 70, 71లలో 'అరుణ గోడౌన్' యాజమాన్యం ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం చేపడుతోందని పలుమార్లు ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపై స్థానిక కమిషనర్, జిల్లా కలెక్టర్‌లకు విన్నవించినా స్పందించకపోవడంతో బాధితులు రాష్ట్ర లోకాయుక్త న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కేసును పరిశీలించిన లోకాయుక్త న్యాయస్థానం.. 23/04/2026 నాటి ఉత్తర్వుల్లో నిర్మాణాన్ని తక్షణమే ఆపివేసి, అక్రమ కట్టడాన్ని పూర్తిగా కూల్చివేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అయితే, పురపాలక కమిషనర్ మాత్రం కోర్టు ఆదేశాల ప్రకారం కూల్చివేత చేపట్టకుండా, నిబంధనల ప్రకారం 'సీజ్' చేసినట్లుగా కాగితాలపై సమాచారం ఇచ్చి చేతులు దులుపుకున్నారని సొసైటీ ప్రతినిధి తలారి చందర్ ఆరోపించారు. వాస్తవానికి క్షేత్రస్థాయిలో ఎలాంటి సీజింగ్ చేయలేదని, పనులు యథేచ్ఛగా సాగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు.

### సర్కారు ఖజానాకు గండి.. కుమ్మక్కైన అధికారులు

ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజులు, పన్నులు చెల్లించకుండా భారీ నిర్మాణాన్ని చేపడుతూ ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతున్నారని ఫిర్యాదులో ఎత్తిచూపారు. గతంలో పనిచేసిన పురపాలక కమిషనర్ స్వామి నాయక్, ప్రస్తుత కమిషనర్ కృష్ణారెడ్డి సహా టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణదారులతో కుమ్మక్కై చర్యలు తీసుకోకుండా తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు.




### సమగ్ర విచారణ జరిపి కూల్చివేయాలి

కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న సంబంధిత అధికారులపై కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, తక్షణమే సదరు అక్రమ కోల్డ్ స్టోరేజ్ నిర్మాణాన్ని నేలమట్టం చేయాలని టీమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ రాష్ట్ర అధ్యక్షుడు తలారి చందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఈ మేరకు గతంలో ఇచ్చిన నోటీసులు, పత్రికా కథనాలు, కోర్టు ఉత్తర్వుల కాపీలను జతచేస్తూ సీడీఎంఏ ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేశారు.

# పంటకు కరెంటు, నీళ్లు వెంటనే అందించాలి

**- సాగు నీరందక ఎండిపోతున్న పంటలు**



**హుజురాబాద్ :** ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడతాయని నిపుణులు ముందస్తుగా హెచ్చరించినా ప్రభుత్వం పట్టించుకోలేదని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ బండ శ్రీనివాస్, రాజపల్లి సర్పంచ్ కటుకూరి మల్లా రెడ్డి, కౌన్సిలర్ వర్ధినేని రవీందర్ రావు అన్నారు. వర్షాభావంతో సాగు చేసిన పంటలు చేతికందే సమయంలో ఎండిపోతున్నాయని, ఎల్ఎండి కింద ఆయకట్టుకు నీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని లిఫ్ట్ చేయాల్సిన ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు ఎక్కడ మంచి పేరు వస్తుందో అనే భయంతో రైతులకు తీరని అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఒక తడి కోసం నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు. అలాగే 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. కేసీఆర్ ప్రభుత్వం హయాంలో రెప్పపాటు విద్యుత్ సరఫరా అంతరాయం వాటిల్లని సంగతి గుర్తుచేశారు. ప్రజావాణి లో దరఖాస్తు చేసిన వారిలో మామిడిపల్లి సాయి, బెదరకోట రవీందర్, బత్తుల సమ్మయ్య, పోతుల సంజీవ్, బెదరకోట శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# సద్దుల బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్

**- మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలి**



**హుజురాబాద్,** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకల నిర్వహణ కోసం హుజురాబాద్ పట్టణంలోని బతుకమ్మ స్థలాల్లో చేపడుతున్న ఏర్పాట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బతుకమ్మ ఆడే ప్రదేశాన్ని పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బతుకమ్మ ఆటలు ముగిసిన అనంతరం పూల బతుకమ్మలను నిమజ్జనం చేసే నీటి ప్రదేశాన్ని కూడా శుభ్రపరచాలని సూచించారు. బతుకమ్మ ఆడేందుకు వచ్చే మహిళలకు సౌకర్యంగా ఉండేలా అవసరమైన చోట్ల వీధి దీపాలు ఏర్పాటు చేయాలని అధికారులకు తెలిపారు. పండుగకు వచ్చే మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ తిరుపతి, కౌన్సిలర్లు సునీత బాబు, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, భాస్కర్, పుణ్య బాబు, ఏఈ నరేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ వినయ్, జవాన్లు రాజు, రమేష్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# విజయవాడలో జాతీయ సరస్ మేళా

**దేశవ్యాప్తంగా గ్రామీణ మహిళా ఉత్పత్తులకు ఒకే వేదిక**

**571కు పైగా స్టాళ్లు.. ప్రారంభించనున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము**



విజయవాడ(ప్రశ్న న్యూస్) గ్రామీణ మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో మార్కెట్ అవకాశాలు కల్పించే లక్ష్యంతో విజయవాడలో తొలిసారిగా జాతీయ స్థాయి సరస్ మేళా నిర్వహించనున్నారు. ఢిల్లీ--ఎన్‌సీఆర్ ప్రాంతం వెలుపల ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఇదే తొలిసారి. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని (శివనాథ్) నేతృత్వంలో ఈ మేళాకు ఏర్పాట్లు చేస్తున్నారు. అక్టోబరు 13 నుంచి 31 వరకు పున్నమి ఘాట్ సమీపంలోని బబ్బూరి గ్రౌండ్స్‌లో జరగనున్న ఈ కార్యక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రారంభించనున్నారు.దేశవ్యాప్తంగా 31 రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతానికి చెందిన మహిళా కళాకారులు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు తమ ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శించి విక్రయించనున్నారు. మొత్తం 571కు పైగా స్టాళ్లలో చేనేత వస్త్రాలు, హస్తకళలు, సహజ ఉత్పత్తులు, ఆహార పదార్థాలు, సంప్రదాయ గ్రామీణ వస్తువులు అందుబాటులో ఉండనున్నాయి. వివిధ రాష్ట్రాల ప్రత్యేక వంటకాలతో ఫుడ్ కోర్టును కూడా ఏర్పాటు చేయనున్నారు.

### మహిళా వ్యాపారానికి జాతీయ వేదిక

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన--జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ (డే-ఎన్‌ఆర్‌ఎల్‌ఎం)లో భాగంగా సరస్ మేళాలను నిర్వహిస్తున్నారు. గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు విక్రయ వేదిక కల్పించడంతోపాటు, వినియోగదారుల అభిరుచులను తెలుసుకోవడం, నాణ్యత పెంచడం, వ్యాపారాన్ని విస్తరించడం ఈ మేళా ప్రధాన ఉద్దేశం.మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, స్వయం సమృద్ధి కలిగిన పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే 'లఖ్‌పతి దీదీ' కార్యక్రమానికీ ఈ వేదిక తోడ్పడనుంది. మహిళలు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించడంతోపాటు, కొత్త కొనుగోలుదారులు, వ్యాపార సంస్థలతో సంబంధాలు పెంచుకునే అవకాశం లభించనుంది.

### శిక్షణ.. మార్కెటింగ్‌పై అవగాహన

మేళాలో ప్రత్యేక పెవిలియన్లను ఏర్పాటు చేయనున్నారు. విజయవంతమైన మహిళా పారిశ్రామికవేత్తలు తమ అనుభవాలను పంచుకునేలా 'లఖ్‌పతి దీదీ' పెవిలియన్ ఉంటుంది. ప్యాకేజింగ్, బ్రాండింగ్, ఈ-కామర్స్, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం, వ్యాపార ప్రణాళికలపై నిపుణులతో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక సహకారం, మార్కెట్ అవకాశాలపై వివరాలు అందించేందుకు మరో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నారు. మహిళా కళాకారులు తమ ఉత్పత్తులను తయారు చేసే విధానాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించే అవకాశం కల్పించనున్నారు.

# వేదమాత గాయత్రీదేవిగా దుర్గమ్మ దర్శనం

**ఇంద్రకీలాద్రిపై రెండో రోజు వైభవంగా శరన్నవరాత్రులు**

**వేకువజామున ఖడ్గమాలార్చన.. ఉదయం 6 గంటల నుంచి కుంకుమార్చనలు**

**భక్తులకు మంచినీరు, ప్రసాదం, ఉచిత రవాణా సదుపాయాలు**



విజయవాడ(ప్రశ్న న్యూస్) ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో రెండో రోజైన సోమవారం జగన్మాత శ్రీ కనకదుర్గమ్మ వేదమాత శ్రీ గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం, విజయవాడ నగరపాలక సంస్థ సమన్వయంతో వివిధ సదుపాయాలు కల్పించారు.

### వేకువజామున ప్రత్యేక పూజలు

నూతన పూజా మండపంలో సోమవారం తెల్లవారుజామున 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక దేవీ ఖడ్గమాలార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఉదయం 6 గంటలకు తొలి విడత విశేష కుంకుమార్చన పూజలు ప్రారంభమయ్యాయి. గాయత్రీదేవి అలంకారంలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకుని భక్తులు పూజలు నిర్వహించారు.

### క్యూలైన్లలో మంచినీటి సరఫరా

భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వినాయక ఆలయం నుంచి ప్రారంభమయ్యే క్యూలైన్లలో నిరంతర మంచినీటి సరఫరా ఏర్పాటు చేశారు. ఉచిత క్లోక్‌రూమ్, పాదరక్షల స్టాండ్లను అందుబాటులో ఉంచారు. సమాచార కేంద్రాలు, మైక్ ప్రచారం ద్వారా భక్తులకు ఎప్పటికప్పుడు అవసరమైన సమాచారం అందిస్తున్నారు.

### ఉచిత ప్రసాదం.. విస్తృతంగా లడ్డూల పంపిణీ

మహామండపం ప్రాంగణంలో భక్తులకు నిరంతరం ఉచిత ప్రసాద వితరణ కొనసాగుతోంది. కనకదుర్గానగర్‌లో లడ్డూ ప్రసాదాల విక్రయానికి విస్తృతంగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల అవసరాలకు అనుగుణంగా లడ్డూలు అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేశారు.

### ప్రత్యేక పూజలకు ఉచిత రవాణా

ప్రత్యేక పూజల్లో పాల్గొనే భక్తుల సౌకర్యార్థం కుమ్మరిపాలెం సెంటర్ నుంచి కొండపైకి ఉచిత వాహనాలు ఏర్పాటు చేశారు. పూజలు, దర్శనం పూర్తిచేసుకున్న భక్తులను తిరిగి కుమ్మరిపాలెం చేర్చేందుకు రథం సెంటర్ ఫుట్ బ్రిడ్జి అవతల, కెనాల్ రోడ్డు వద్ద వాహనాలను సిద్ధంగా ఉంచారు.భక్తులకు ప్రశాంత వాతావరణంలో అమ్మవారి దర్శనం కల్పించడంతోపాటు, తాగునీరు, ప్రసాదం, రవాణా వంటి సదుపాయాలను సమర్థంగా అందించేందుకు దేవస్థానం, నగరపాలక సంస్థ సమన్వయంతో ఏర్పాట్లు కొనసాగిస్తున్నాయి.

# దసరా ఏర్పాట్లపై దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ సమీక్ష

**భక్తులకు మజ్జిగ, మంచినీరు నిరంతరం అందించాలి**

**లడ్డూ తయారీ కేంద్రం, అన్నప్రసాద భవనం, వైద్య శిబిరాల పరిశీలన**



ఇంద్రకీలాద్రి,(ప్రశ్న న్యూస్) దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు ఇంద్రకీలాద్రికి తరలివస్తున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ ఆదేశించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు నిరంతరం మజ్జిగ, తాగునీరు అందించాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. సోమవారం ఉదయం ఆయన ఇంద్రకీలాద్రిపై దసరా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

### లడ్డూల కొరత రాకూడదు

రాజమహేంద్రవరం ఆర్జేసీ, దసరా ఫెస్టివల్ ఆఫీసర్ వి. త్రినాథరావుతో కలిసి కమిషనర్ కొండపైన, దిగువన వివిధ విభాగాల పనితీరును సమీక్షించారు. తొలుత లడ్డూ తయారీ కేంద్రాన్ని పరిశీలించి, భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రసాదాలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కౌంటర్లలో లడ్డూల కొరత లేకుండా నిల్వలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని, భక్తులకు వేగంగా ప్రసాదాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### అన్నప్రసాద నాణ్యతపై ఆరా

నూతన అన్నప్రసాద భవనాన్ని సందర్శించిన కమిషనర్ అక్కడ జరుగుతున్న అన్నదాన ఏర్పాట్లను పరిశీలించారు. భోజనం చేస్తున్న భక్తులతో మాట్లాడి ఆహార నాణ్యత, సేవలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. సేవకులను అడిగి వితరణ వివరాలను ఆరా తీశారు. భక్తులు సంతృప్తి వ్యక్తం చేయడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

### వైద్య శిబిరాల్లో మందులు సిద్ధంగా ఉంచాలి

ఘాట్ రోడ్డు, ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాలను తనిఖీ చేసి, అత్యవసర మందుల లభ్యతపై వైద్య సిబ్బందితో సమీక్షించారు. ఎండ తీవ్రత కారణంగా చిన్నారులు, వృద్ధులు, ఇతర భక్తులు అలసటకు గురికాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచడంతోపాటు క్యూలైన్లలో మజ్జిగ పంపిణీని విస్తృతం చేయాలని ఆదేశించారు.

### పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

ఇంద్రకీలాద్రిపై నిరంతర మంచినీటి సరఫరా జరిగేలా చూడాలని, ఎక్కడా నీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కమిషనర్ స్పష్టం చేశారు. క్యూలైన్లు, హోల్డింగ్ కేంద్రాల్లో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. క్యూలైన్ల నిర్వహణను పరిశీలించి, సామాన్య భక్తులకు ఇబ్బందులు కలగకుండా దర్శనం సజావుగా జరిగేలా పోలీసు యంత్రాంగం, ఆలయ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్జేసీ, దసరా ఫెస్టివల్ ఆఫీసర్ వి. త్రినాథరావు, ఆలయ ఇంజినీరింగ్ అధికారులు, పర్యవేక్షక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో బ్రహ్మచారిణి అలంకారంలో భ్రమరాంబాదేవి

**నవరాత్రుల్లో రెండో రోజు విశేష పూజలు..**

**రాత్రి కాళరాత్రి పూజలు మయూర వాహనంపై**

**స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం**



శ్రీశైలం (ప్రశ్న న్యూస్) శ్రీశైలం శ్రీ భ్రమరాంబికా అమ్మవారి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం రెండో రోజు అమ్మవారిని బ్రహ్మచారిణి స్వరూపంలో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో కుంకుమార్చనలు, నవావరణార్చనలు, చండీహోమం, వేద పారాయణలు, కుమారీపూజలు తదితర కార్యక్రమాలు జరిపారు. సాయంత్రం స్వామి అమ్మవార్లకు మయూర వాహనసేవ నిర్వహించి, అనంతరం గ్రామోత్సవం చేపట్టారు.

### బ్రహ్మచారిణి స్వరూపంలో అమ్మవారు

నవదుర్గలలో రెండో రూపమైన బ్రహ్మచారిణి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ స్వరూపంలో దేవి కుడిచేతిలో జపమాల, ఎడమచేతిలో కమండలాన్ని ధరించి ఉంటారు. బ్రహ్మచారిణిని ఆరాధించడం వల్ల త్యాగం, వైరాగ్యం, ఆధ్యాత్మిక నిబద్ధత అలవడతాయని దేవీభాగవతం పేర్కొంటున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ రూపాన్ని ఉపాసించడం ద్వారా మానసిక ప్రశాంతత, విజయాలు సిద్ధిస్తాయని భక్తులు విశ్వసిస్తారు.

### విశేష పూజలు.. హోమాలు

ఉదయం ప్రాతఃకాల పూజలతో ప్రారంభమైన కార్యక్రమాల్లో విశేష కుంకుమార్చనలు, నవావరణార్చనలు, జపానుష్ఠానాలు, సూర్య నమస్కారాలు, చండీహోమం, భ్రామరి, బాలా జపానుష్ఠానాలు నిర్వహించారు. చండీ పారాయణ, చతుర్వేద పారాయణలు, కుమారీపూజలు జరిపారు. అనంతరం రుద్రహోమం, రుద్రయాగాంగ జపాలు, రుద్ర పారాయణలు నిర్వహించారు. సాయంత్రం నవావరణార్చన, కుంకుమార్చన, చండీహోమం, సహస్రనామార్చనలు చేపట్టారు.

### బాలికలకు కుమారీపూజ

దసరా ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ నిర్వహించే కుమారీపూజకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. రెండేళ్ల నుంచి పదేళ్లలోపు బాలికలను దేవీ స్వరూపాలుగా భావించి పూలు, పండ్లు, నూతన వస్త్రాలు సమర్పించి పూజిస్తారు. నవరాత్రుల్లో ఈ ఆచారం ముఖ్యమైన సంప్రదాయంగా కొనసాగుతోంది.

### మయూర వాహనంపై స్వామి అమ్మవార్లు

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి మయూర వాహనంపై కొలువుదీర్చి పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం జరిపించారు. రాత్రి 9 గంటల నుంచి కాళరాత్రి పూజ, అమ్మవారి ఆస్థాన సేవ, సువాసినీ పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.శ్రీశైల దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఉత్తర్వుల మేరకు ఈ కార్యక్రమాల వివరాలను ఆలయ అధికారులు వెల్లడించారు.

# దర్శి అభివృద్ధికి మరో ముందడుగు!

**ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్ పనులు పునఃప్రారంభం**





దర్శి(ప్రశ్న న్యూస్) దర్శి నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరో అడుగు పడింది. గతంలో నిలిచిపోయిన ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్ నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించడంతోపాటు, పోతకమూరు-పాపిరెడ్డిపాలెం రహదారి నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. దర్శి టీడీపీ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

### డ్రైవింగ్ స్కూల్‌కు రూ.9 కోట్లు

దర్శిలో ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటుకు 2014లో అప్పటి ప్రభుత్వం సుమారు రూ.22 కోట్లు కేటాయించిందని, రూ.2 కోట్లకు పైగా విలువైన పనులు పూర్తయ్యాయని గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. 2019లో ప్రభుత్వం మారిన తర్వాత పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును పలుమార్లు కలిసి పనుల పునఃప్రారంభానికి విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు.తొలి విడతలో సుమారు రూ.9 కోట్లతో పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. డ్రైవింగ్ శిక్షణకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తే ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్అండ్‌బీ అధికారులు, టీడీపీ యువ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, స్థానిక నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

### రూ.1.20 కోట్లతో రహదారి నిర్మాణం

పోతకమూరు-పాపిరెడ్డిపాలెం రహదారి నిర్మాణానికి రూ.1.20 కోట్ల వ్యయంతో గొట్టిపాటి లక్ష్మి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఈ సందర్భంగా పార్టీ నాయకులు పేర్కొన్నారు. రహదారి అందుబాటులోకి వస్తే ఆయా గ్రామాల ప్రజల రాకపోకలకు సౌలభ్యం కలగనుంది.

### పలు అభివృద్ధి పనులు

దర్శి నగర పంచాయతీని మున్సిపాలిటీగా అభివృద్ధి చేయడం, మినీ స్టేడియం, క్రికెట్ స్టేడియం, డిగ్రీ కళాశాల, కోల్డ్ స్టోరేజ్, టీటీడీ కల్యాణ మండపం, అన్న క్యాంటీన్ వంటి కార్యక్రమాలను లక్ష్మి ప్రస్తావించారు. పట్టణంలో రహదారులు, డ్రైనేజీ, విద్యుదీకరణ పనుల కోసం మరో రూ.20 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, స్థానిక సమస్యల పరిష్కారానికి కూటమి నాయకులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయం సాధించేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమాల్లో దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి--సుబ్బారావు, ఆర్అండ్‌బీ డీఈ గోపీకృష్ణ, జేఈ రఫీ, స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కరెంట్ కోతలతో రైతులను వేధిస్తున్న కాంగ్రెస్ సర్కార్

**- సబ్ స్టేషన్ల ముట్టడికి బడే నాగజ్యోతి పిలుపు**



**ములుగు** కరెంట్ కోతలతో రైతులను అరిగోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా ములుగు నియోజకవర్గ వ్యాప్తంగా విద్యుత్ సబ్ స్టేషన్ల ముట్టడికి బీఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ జెడ్పీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి పిలుపునిచ్చారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల వ్యవసాయ అవసరాలను దృష్టిలో ఉంచుకుని 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్ ను అందించారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం 6 గంటల పాటు కూడా సక్రమంగా విద్యుత్ సరఫరా చేయలేక రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆమె విమర్శించారు.విద్యుత్ కోతల కారణంగా పంటలకు నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతులకు నిరంతర విద్యుత్ అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేశామని చెప్పుకునే గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ప్రస్తుత కాంగ్రెస్ పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు, 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని డిమాండ్ చేస్తూ ములుగు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద ముట్టడి, నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.తాజా, మాజీ మండల పార్టీ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు సమన్వయంతో ఈ నిరసన కార్యక్రమాల్లో పాల్గొని రైతుల హక్కుల కోసం గళమెత్తాలని కోరారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ వారి పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

# ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ మాలతి తో కలిసి అదనపు కలెక్టర్ అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, సివిల్ సప్లైస్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించి మొత్తం 88 దరఖాస్తులు ప్రజల నుండి స్వీకరించినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల సమస్యలకు ప్రాధాన్యతనిచ్చి వేగంగా పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అనుమానస్పదంగా రైతు మృతి



ఎల్లారెడ్డిపేట(ప్రశ్న న్యూస్)దుమాల గ్రామంలో వరి పొలంలో మెగిపురుగు పిచికారి చేస్తున్న క్రమంలో అనుమానస్పదంగా ఓ రైతు మృతి చెందినట్లు ఎస్సై రమేష్ తెలిపారు. ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం దుమాలకు చెందిన కురుకుంట్ల దేవరాజు (45 ) దుమాలలోని పురుగుల మందు కొట్టేందుకు వెళ్లాడు. కొద్దిసేపటికి ఉన్నట్టుండి పొలంలో పడిపోయి మృతి చెందినట్లు దేవరాజ్ సోదరుడు గుర్తించాడు. అందుకు సంబంధించిన వివరాలను కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో దేవరాజు భార్య రేణుక తన భర్త ఎండలో మందు చల్లడం వల్ల గాని, కాలుజారి కింద పడిపోవడం వల్ల గాని, ఇంకేదైనా అనారోగ్య కారణం వల్ల గాని చనిపోయి ఉంటాడని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. తన భర్త మృతి గల కారణాల పై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

# ప్రతిభకు వేదిక.. కళలకు ప్రోత్సాహం

## విజయవాడ ఉత్సవ్ 2.0లో పోటీలను సందర్శించిన కేశినేని జానకి లక్ష్మి



విజయవాడ(ప్రశ్న న్యూస్) విజయవాడ ఉత్సవ్ 2.0లో భాగంగా నిర్వహిస్తున్న కళా, సాంస్కృతిక పోటీలు విద్యార్థులు, యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు చక్కని వేదికగా నిలుస్తున్నాయి. కేశినేని ఫౌండేషన్, జిజ్ఞాస ఆర్ట్ వర్క్స్ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న పోటీలకు విశేష స్పందన లభిస్తోంది. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సతీమణి కేశినేని జానకి లక్ష్మి సోమవారం ఈ పోటీలను సందర్శించి, వివిధ విభాగాల్లో పాల్గొన్న చిన్నారులు, విద్యార్థులు, యువత ప్రదర్శించిన ప్రతిభను పరిశీలించారు.

### సంప్రదాయ కళలకు పెద్దపీట

విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో తొలుత జానకి లక్ష్మి పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కార్యక్రమాల వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆమెకు ఆశీర్వచనాలు అందజేసి, అమ్మవారి చిత్రపటం, ప్రసాదాన్ని అందించారు. అనంతరం తుమ్మలపల్లి కళాక్షేత్రానికి చేరుకున్న ఆమె.. కేశినేని ఫౌండేషన్, జిజ్ఞాస ఆర్ట్ వర్క్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న కళా, సాంస్కృతిక పోటీలను తిలకించారు. సోలో క్లాసికల్ డ్యాన్స్, గాత్ర సంగీతం, సినిమాటిక్ సోలో, తెలుగు పద్యాల పఠనం, కథా వాచకం, ఫ్యాన్సీ డ్రెస్, గ్రూప్ క్లాసికల్ డ్యాన్స్, వాయిద్య సంగీతం, కథా రచన, క్విజ్, మ్యాజిక్ షోలు, బుర్రకథ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. పోటీల్లో పాల్గొన్నవారి వివరాలు, విజేతల ప్రతిభ గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

# నవరాత్రుల మూడో రోజు..

# చంద్రఘంట అమ్మవారి అవతారం విశిష్టత

## నుదుటిపై అర్ధచంద్రంతో దివ్యరూపం.. ధైర్యం, శౌర్యం, శాంతికి ప్రతీకగా ఆదిశక్తి

(ప్రశ్న న్యూస్ ప్రత్యేక కథనం మేడ్చల్ ప్రతినిధి చిన్న )

నవరాత్రి ఉత్సవాల్లో మూడో రోజుకు ప్రత్యేకమైన ఆధ్యాత్మిక విశిష్టత ఉంది. ఈ రోజున దుర్గాదేవి నవదుర్గలలో మూడో రూపమైన చంద్రఘంట అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తారు. నుదుటిపై గంట ఆకారంలో అర్ధచంద్రుడిని ధరించి దర్శనమిచ్చే ఈ అమ్మవారు ధైర్యానికి, పరాక్రమానికి, శాంతికి ప్రతీకగా పూజలందుకుంటారు. దుష్టశక్తులను ఎదుర్కొంటూనే భక్తులకు అభయాన్ని ప్రసాదించే శక్తిస్వరూపిణిగా భక్తులు అమ్మవారిని కొలుస్తారు.

### చంద్రఘంట అనే పేరు వెనుక విశిష్టత ఏమిటి?

చంద్ర' అంటే చంద్రుడు, ఘంట' అంటే గంట. నుదుటిపై గంట ఆకారంలో అర్ధచంద్రుడిని ధరించిన కారణంగా అమ్మవారికి చంద్రఘంట అనే పేరు వచ్చిందని పురాణ సంప్రదాయం చెబుతుంది. ఆమె దివ్యరూపం భక్తుల్లో ధైర్యాన్ని నింపుతుందని, భయాలను తొలగించి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని భక్తుల విశ్వాసం. పార్వతీదేవి శివుడిని వివాహం చేసుకున్న అనంతరం ధరించిన దివ్యరూపంగా కూడా చంద్రఘంట అమ్మవారిని కొన్ని పురాణ సంప్రదాయాలు వర్ణిస్తాయి. ఈ రూపం సౌమ్యతతో పాటు శత్రువులను ఎదుర్కొనే శక్తిని కూడా సూచిస్తుంది.

### అమ్మవారి రూపం.. ఆయుధాల విశిష్టత

చంద్రఘంట అమ్మవారు సాధారణంగా పది చేతులతో, సింహవాహనంపై ఆసీనురాలై దర్శనమిస్తారు. ఆమె చేతుల్లో త్రిశూలం, ఖడ్గం, గద, విల్లు, బాణం వంటి ఆయుధాలతో పాటు కమలం, జపమాల వంటి వస్తువులు కనిపిస్తాయి. వివిధ చిత్రణల్లో ఆయుధాలు, చేతుల అమరికలో స్వల్ప భేదాలు ఉండవచ్చు. సింహం ధైర్యానికి, పరాక్రమానికి ప్రతీకగా భావిస్తారు. అమ్మవారి ఆయుధాలు అన్యాయాన్ని ఎదుర్కొనే శక్తిని సూచిస్తే, ఆమె ప్రశాంతమైన ముఖం కరుణకు, మనోనిగ్రహానికి ప్రతిరూపంగా నిలుస్తుంది. అంటే శక్తి ఉన్నంత మాత్రాన కోపంతో వ్యవహరించాల్సిన అవసరం లేదని, ధైర్యంతో పాటు వివేకం కూడా ముఖ్యమని ఈ రూపం తెలియజేస్తుంది.

### మూడో రోజు పూజల విశిష్టత

నవరాత్రుల మూడో రోజున భక్తులు చంద్రఘంట అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పుష్పాలతో అలంకరించి, దీపారాధన చేసి, నైవేద్యాలు సమర్పిస్తూ అమ్మవారి అనుగ్రహాన్ని కోరుకుంటారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు, కుంకుమార్చనలు నిర్వహించడం కనిపిస్తుంది. చంద్రఘంట అమ్మవారిని ఆరాధించడం వల్ల భయాలు తొలగి, ధైర్యం, ప్రశాంతత, ఆత్మవిశ్వాసం కలుగుతాయని భక్తులు విశ్వసిస్తారు. కుటుంబంలో సుఖశాంతులు నెలకొనాలని, జీవితంలోని అడ్డంకులను అధిగమించే శక్తి లభించాలని ప్రార్థిస్తారు.

### చంద్రఘంట అమ్మవారి ఆరాధనలో అంతరార్థం

అమ్మవారి అవతారం మనిషి జీవితానికి గొప్ప సందేశాన్ని అందిస్తుంది. సమస్యలు ఎదురైనప్పుడు భయపడి వెనకడుగు వేయకుండా, ధైర్యంగా వాటిని ఎదుర్కోవాలి. అదే సమయంలో ఆవేశానికి లోనుకాకుండా ప్రశాంతంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. నేటి సమాజంలో కుటుంబ సమస్యలు, ఉద్యోగ ఒత్తిళ్లు, ఆర్థిక ఇబ్బందులు, వ్యక్తిగత సవాళ్లు మనిషిని మానసికంగా కుంగదీస్తుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో చంద్రఘంట అమ్మవారి రూపం ధైర్యాన్ని కోల్పోకూడదని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని స్ఫూర్తినిస్తుంది. అన్యాయాన్ని ఎదుర్కొనే సాహసం, ఇతరుల పట్ల కరుణ, మనసులో ప్రశాంతత కలిగి ఉండటమే ఈ అవతారం అందించే




ప్రధాన సందేశం.

### శక్తి, శాంతి కలగలిసిన దివ్యస్వరూపం

చంద్రఘంట అమ్మవారి రూపంలో శౌర్యం, సౌమ్యత రెండూ సమానంగా కనిపిస్తాయి. అవసరమైనప్పుడు ధర్మాన్ని కాపాడేందుకు పోరాడే శక్తి, అదే సమయంలో భక్తుల పట్ల కరుణ చూపే తల్లితనం ఈ అవతారం ప్రత్యేకతగా నిలుస్తాయి. నవరాత్రుల మూడో రోజున చంద్రఘంట అమ్మవారిని భక్తిశ్రద్ధలతో స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ తమలో ధైర్యం, సహనం, వివేకం, దయ వంటి సద్గుణాలను పెంపొందించుకోవాలి. అమ్మవారి కృపతో ప్రతి కుటుంబంలో ఆనందం, ఐకమత్యం, సుఖశాంతులు వెల్లివిరియాలని భక్తులు ఆకాంక్షిస్తారు.

# “6”ఏళ్ల పాప హత్య కేసులో నిందితుడు కటకటాల పాలు

- మల్కాజిగిరి డిసిపి జోన్ కార్యాలయం ముందు అరోలియ ఫెర్నాండెజ్ అలియాస్ మోనో బంధువులు ధర్నా
- నిందితుడుని ఉరి తీయాలని నిరసన వ్యక్తం చేసిన కాలనీ వాసులు-
- చట్టాలు కఠినంగా అమలు కావడం లేదు,బయట దేశాల్లో నేరం జరిగిన గంటల వ్యవధిలోనే న్యాయం దొరుకుతుంది
- నల్ల బ్యాచిలతో న్యాయం కావాలి అంటూ నినాదాలతో దద్దరిల్లిన పోలీస్ కార్యాలయ ప్రాంగణం

పోలీసులు హామీతో శాంతించిన బాధితులు, త్వరలో నిందితుడికి శిక్ష తప్పదన్న ఉన్నతాధికారులు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ జిల్లా బొల్లారంలోని కౌకూరు జనప్రియ అర్కాడియా(విల్లా ఆర్కిడ్స్)లో మూడు రోజుల క్రితం కిడ్నాప్‌నకు గురైన ఐదేళ్ల చిన్నారి మోజస్ అరులియా ఫెర్నాండెజ్ (మోను) దారుణ హత్యకు గురైన విషయం విదితమే. అల్లారు ముద్దుగా పెంచుకున్న తమ గారాల పట్టి క్షేమంగా తిరిగి వస్తుందని కోటి ఆశలతో ఎదురుచూసిన తల్లిదండ్రులకు నిరాశే మిగిలింది. గేటెడ్ కమ్యూనిటీలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన విధుల్లో నుంచి తొలగించబడిన బిహార్‌కు చెందిన విక్రమ్ కుమార్ అనే సెక్యూరిటీ గార్డే ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. పసిపాప ప్రాణాలను కిరాతకంగా తీసిన ఈ ఘటనతో విల్లా పరిసరాల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. చిన్నారి మోను తల్లిదండ్రులు అగ్రికల్చరల్ సైంటిస్ట్ మిల్టన్,బేనీ దంపతులు జనప్రియ అర్కేడియాలోని విల్లా నెంబర్ 84లో నివాసం ఉంటున్నారు. అయితే సెక్యూరిటీ గార్డు విక్రమ్ సరిగ్గా ప్రవర్త కారణంతో అతడిని విల్లా అసోసియేషన్ కమిటీ వారం రోజుల క్రితమే ఉద్యోగం నుండి తొలగించారు. ఆ కమిటీలో చిన్నారి మోను తాత కూడా కీలక సభ్యుడు కావడంతో, ఉద్యోగం పోయిందన్న కసితో వారిపై విక్రమ్ కుమార్ కక్ష పెంచుకున్నాడు. ఎలాగైనా వారిని దెబ్బతీసి పెద్ద మొత్తంలో డబ్బు గుంజాలని పథకం వేశాడని మల్కాజిగిరి సిపి సుమతి విలేకరుల సమావేశంలో తెలిపారు. చిన్నారి అరులియా శనివారం సాయంత్రం 7 గంటల సమయంలో విల్లా అవరణలో సైకిల్ తొక్కుతూ తోట విల్లాలో అడుకుంటుంది. చిన్నారిని మాటల్లో పెట్టిన విక్రమ్.. చాకెట్లు ఇస్తానని ఆశ చూపి క్లబ్‌హౌస్ సెల్లార్ వైపు తీసుకెళ్లాడు. పాప కనిపించకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు కాలనీ మొత్తం వెతికి వెంటనే బొల్లారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడు 8 గంటలకే తల్లిదండ్రులకు ఫోన్ చేసి రూ. 20 లక్షలు కావాలని డిమాండ్ చేయడం. తల్లిదండ్రులు డబ్బులు ఇచ్చేందుకు సిద్ధమైనా.. పాపాను బయటకు తీసుకెళ్లేందుకు వీలుకాకపోవడంతో దారుణానికి ఒడిగట్టినట్లు విక్రం కుమార్ పోలీసులకు తెలిపాడని,మల్కాజిగిరి పోలీసులు రంగంలోకి దిగి పది ప్రత్యేక బృందాలతో ఫోను,డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌ల సాయంతో ముమ్మర గాలింపు చేపట్టారు. కాలనీ ఎంట్రన్స్ సీసీటీవీ పుటేజ్‌లను పరిశీలించగా చిన్నారి బయటకు వెళ్లేదని, వాచ్మెన్ విక్రమ్ ఒక్కడే అనుమానాస్పదంగా పారిపోతున్నట్లు సిసి కెమెరాల్లో స్పష్టమైంది. విక్రమ్ ఫోన్ లోకేషన్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసరాల్లో చూపించడంతో లాడ్జులు,హోటళ్లను జల్లెడ పట్టారు. మరోవైపు విల్లా క్లబ్‌హౌస్ సమీపంలో చిన్నారి సైకిల్ పడి ఉండటాన్ని గుర్తించిన పోలీసులు వెంటనే సెల్లార్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో అక్కడ ఉన్న నీటి సంపలో చూడగా కాళ్ళు,చేతులు తాళ్లతో కట్టేసి పడేసిన చిన్నారి మృతదేహం కనిపించింది. ఒక్కడేనా లేక ఇంకా ఎవరైనా ఉన్నారా? చిన్నారి కిడ్నాప్, హత్య ఘటనలో మరో ఇద్దరు ముగ్గురు సహకారం ఉండే ఉంటుందని పోలీసులు అనుమానించి ముగ్గుర్నీ అదుపులోకి తీసుకుని విచారించగా వారి పాత్ర ఏమి లేదని తేలింది. అయితే ఈ కేసులో ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా తొందరగా శిక్ష పడేలా చూస్తామని సిపి సుమతి తెలిపారు. ఇరవై నాలుగు గంటల్లో ఈ కేసు చిక్కు ముడిని విప్పిన అధికారులను సిపి ప్రత్యేకంగా అభినందించారు.

### బాధిత కుటుంబం,కాలనీ వాసులు ధర్నా:

మల్కాజిగిరి డిసిపి కార్యాలయం ముందు బైఠాయించిన మోజస్ అరులియా ఫెర్నాండెజ్ కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు. అభం శుభం తెలియని పసిపాపను పొట్టన పెట్టుకున్న సెక్యూరిటీ గార్డును అప్పగించాలని డిమాండ్ చేస్తూ నినాదాలతో






హోరెత్తించారు. లేదా అతనికి ఉరి శిక్ష విధించాలని లేని పక్షంలో మా పోరాటం ఆగదని తేల్చి చెప్పారు. తరువాత పోలీసుల జోక్యంతో సైలెంట్ అయిన కాలనీ వాసులు. ఉన్నధికారుల హామీతో శాంతించిన పాప కుటుంబ సభ్యులు,కాలనీ వాసులు.

# పల్లెలకు సిమెంట్ రహదారులు.. పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా

## మైలవరం నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

ఇబ్రహీంపట్నం(ప్రశ్న న్యూస్) మైలవరం నియోజకవర్గంలో గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి, పేద కుటుంబాలకు ఆర్థిక చేయూత లక్ష్యంగా పలు కార్యక్రమాలు చేపట్టినట్లు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు తెలిపారు. పల్లెపండుగ 3.0 కింద వివిధ గ్రామాల్లో సిమెంట్ రహదారుల నిర్మాణానికి శంకుస్థాపనలు చేయడంతోపాటు, పి4 బంగారు కుటుంబం కార్యక్రమం ద్వారా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఎనిమిది కుటుంబాలకు రూ.4.80 లక్షల సాయం అందించారు. మరోవైపు జి.కొండూరు మండలం చెవుటూరులో టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

### రూ.16.2 కోట్లతో రహదారుల నిర్మాణం

పల్లెపండుగ 3.0 కింద మైలవరం నియోజకవర్గంలో రూ.16.2 కోట్ల వ్యయంతో సిమెంట్ రహదారుల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. సోమవారం ఇబ్రహీంపట్నం మండలం మూలపాడులో రూ.47 లక్షలు, జూపూడిలో రూ.30 లక్షలు, గుంటుపల్లిలో రూ.48 లక్షలతో చేపట్టనున్న రహదారుల పనులకు శంకుస్థాపన చేశారు. గుంటుపల్లిలో 450 మీటర్ల పొడవున అంతర్గత సిమెంట్ రహదారులు నిర్మించనున్నారు. అనంతరం జి.కొండూరు గ్రామంలో రూ.50 లక్షలతో, 750 మీటర్ల పొడవున, 15 అడుగుల వెడల్పుతో చేపట్టనున్న అంతర్గత రహదారుల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సదుపాయాలను మెరుగుపరచి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యమని కృష్ణప్రసాదు తెలిపారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.



### చెవుటూరులో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

జి.కొండూరు మండలం చెవుటూరులో సోమవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని వసంత కృష్ణప్రసాదు ఆవిష్కరించారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పిన నాయకుడిగా ఎన్టీఆర్ చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. పేదల సంక్షేమం, మహిళల సాధికారత, సామాన్య కుటుంబాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి తరతరాలకు స్ఫూర్తినిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమాల్లో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నా జీవితంలో చేసిన అతిపెద్ద ప్రయోగం అదే..

## ఆసక్తికర విషయాలు చెప్పిన రాజమౌళి





దర్శకధీరుడు ఎస్‌ఎస్ రాజమౌళి కెరీర్‌లో 'బాహుబలి'కి ప్రత్యేక స్థానం ఉంది. ఈ సినిమాతో ఆయన పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు సంపాదించగా, 'ఆర్‌ఆర్‌ఆర్'తో అంతర్జాతీయ ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. అయితే తనకు అత్యంత సంతృప్తినిచ్చిన సినిమా మాత్రం 'బాహుబలి' కాదని రాజమౌళి వెల్లడించారు. తనలో నిజమైన ఆత్మవిశ్వాసాన్ని నింపిన చిత్రం 'ఈగ' అని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సూపర్‌స్టార్ మహేశ్ బాబుతో కలిసి రాజమౌళి తెరకెక్కిస్తున్న 'వారణాసి' ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. ఈ నేపథ్యంలో ఓ ప్రముఖ మీడియా ఛానల్‌తో మాట్లాడిన ఆయన తన సినీ ప్రయాణానికి సంబంధించిన పలు విషయాలను పంచుకున్నారు. ప్రేక్షకులు తన కెరీర్‌ను 'బాహుబలి'కి ముందు, తర్వాత అని విభజించి చూస్తారని, కానీ తన దృష్టిలో మాత్రం 'ఈగ'కు ముందు, తర్వాత అనే విభజన ఉంటుందని తెలిపారు. 'ఈగ' తన కెరీర్‌లో చేసిన అతిపెద్ద ప్రయోగమని రాజమౌళి చెప్పారు. ఒక ఈగను ప్రధాన పాత్రగా తీసుకుని, దాని చుట్టూ భావోద్వేగాలతో కూడిన కథను నడిపించడం తనకు ఎంతో ప్రత్యేకమైన అనుభవమని వివరించారు. ఆ సినిమా తనకు అందించిన సంతృప్తి మాటల్లో చెప్పలేనిదని పేర్కొన్నారు.

భవిష్యత్తులో ఎన్ని సినిమాలు తీసినా 'ఈగ' తనకు ఎప్పటికీ ప్రత్యేకంగానే ఉంటుందని స్పష్టం చేశారు. రాజమౌళి వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. భారీ స్థాయి చిత్రాలతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు, తనకు వ్యక్తిగతంగా ఎంతో తృప్తినిచ్చిన సినిమాగా 'ఈగ'ను పేర్కొనడం విశేషం. మరోవైపు మహేశ్ బాబుతో రూపొందిస్తున్న 'వారణాసి'పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి.

# డ్యాన్స్ షో ఆఫర్ వస్తే అనుపమ పరమేశ్వరన్

# షాకయ్యిందట..



రింగురింగుల జుట్టుతో కుర్రకారు మనసులో చెరగని ముద్రవేసుకుంది కేరళ చిన్నది అనుపమ పరమేశ్వరన్. మలయాళంతోపాటు తెలుగు, తమిళ భాషల్లో స్టార్ యాక్టర్లతో కలిసి నటిస్తూ సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. ఈ బ్యూటీని ఒక ఆఫర్ సర్‌ప్రైజ్ చేసిందట. ఇంతకీ ఏ సినిమానో అనుకుంటున్నారా..? కాదండి.. అనుపమకు ఓ పాపులర్ డ్యాన్స్ రియాలిటీ షో నుంచి ఆఫర్ వచ్చింది. తెలుగు రియాలిటీ డ్యాన్స్ షో 'ఢీ' నయా సీజన్‌కు జడ్జిగా చేయాలని ఆఫర్ రావడంతో షాకయ్యానని చెప్పింది అనుపమ.

ఈ విషయమై ఓ ఇంటర్వ్యూలో అనుపమ మాట్లాడుతూ.. సినిమాలకు అతీతంగా కొత్త అవకాశాలను అన్వేషించడం తనకు ఇష్టమని చెప్పింది. సినిమాలో తన మార్క్ చూపించిన తర్వాత షార్ట్ ఫిల్మ్, మ్యూజిక్ వీడియోల్లో నటించే అవకాశాలు వచ్చాయని... ఢీ షోకు జడ్జిగా చేయాలనే ఆఫర్ వస్తుందని తానెప్పుడు ఊహించలేదని, డిఫరెంట్ ఫార్మాట్లలో ప్రయోగాలు చేయడాన్ని ఎంజాయ్ చేయడం వల్ల తాను షో చేసేందుకు ఒప్పుకున్నానని చెప్పుకొచ్చింది.
ఎప్పుడైనా కొంతగా ప్రయత్నించే ఆసక్తికరమైన అవకాశాలు వస్తే స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నానంది అనుపమ. డ్యాన్స్ షోకు జడ్జిగా చేయాలని అనుపమ నిర్ణయించుకోవడం కొత్త అనుభవాలను ఆవిష్కరించుకోవాలనే తన తపనను ప్రతిబింబిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. మరి డ్యాన్స్ రియాలిటీ షోకు జడ్జిగా ప్రేక్షకుల దగ్గర అనుపమ ఎలాంటి మార్కులు కొట్టేస్తుందనేది చూడాలి.

# పోతురాజు పూనినట్ల పోతుగడ్డ ఆడదా



ప్రమోషన్స్‌లో భాగంగా ఆదివారం ఈ సినిమా నుంచి 'కోబలి..' సాంగ్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'రేగే ఉరుము దరువు నిన్ను ముట్టగా.. అష్టదిక్కులే పిక్కటిల్లవా.. జోగే రేయిలోన పగల సెగలిలా పొగులుతుండగా.. పగలు పుట్టదా.. మూగే సావునైన సంపడానికీ.. సత్తువియ్యరా.. కాలకాలుడా.. పెన్నే రెల్లెతేరు ఉరకలెత్తగా సిందు తొక్కమా భద్రమల్లడా.. సామీ.. నీ వరం.. కాదా ఆయుధం.. లోకం.. కన్ను సెదర పోతురాజు పూనినట్ల పోతుగడ్డ ఆడదా..' అంటూ గూస్‌బంప్స్ తెప్పించే సంగీత సాహిత్యాలతో ఈ పాట సాగింది. కేశవాదిత్య రాసిన ఈ పాటను అజయ్-అతుల్ స్వరపరచగా, వీఎం మహాలింగం మెస్మరైజ్ చేసేలా పాడారు. ఈపాటలో విజయ్ దేవరకొండ ఫెరోషియస్‌గా కనిపించారు. అర్నాల్డ్ వోస్లూ ప్రతినాయకుడిగా నటించిన ఈచిత్రానికి రచన: ప్రమోద్ తమ్మినేని, కెమెరా: నీరవ్ షా, జిష్ణు భట్టాజిష్ణు భట్టాచర్జీ, సమర్పణ: గుల్షన్ కుమార్, భూషణ్‌కుమార్, టీసిరీస్ ఫిల్మ్స్.

# ప్రభాస్ పుట్టినరోజున 'ఫౌజీ' టీజర్ రావడం లేదా ..

**- అభిమానులకు మైత్రి నవీన్ కీలక అప్‌డేట్!**



రెబల్ స్టార్ ప్రభాస్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'ఫౌజీ' ఒకటి. 'సీతారామం' ఫేమ్ హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ పీరియడ్ యాక్షన్ డ్రామాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అక్టోబర్ 23న ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా సినిమా టీజర్ విడుదల కానుందంటూ ఇటీవల వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే ఈ ప్రచారంపై తాజాగా నిర్మాత మైత్రీ నవీన్ స్పష్టత ఇచ్చారు. ప్రభాస్ పుట్టినరోజున టీజర్ విడుదల చేయడం లేదని వెల్లడించారు. ప్రభాస్ పుట్టినరోజు అక్టోబర్ 23న కావడంతో 'ఫౌజీ' నుంచి ప్రత్యేక అప్‌డేట్ వస్తుందని అభిమానులు ఆశించారు. ఈ క్రమంలోనే చిత్ర టీజర్‌ను అదే రోజున విడుదల చేయనున్నట్లు వార్తలు చక్కర్లు కొట్టాయి. అయితే తాజాగా ఓ విలేకరి ఇదే విషయాన్ని నిర్మాత మైత్రీ నవీన్‌ను ప్రశ్నించగా, ఆయన ఆసక్తికరమైన సమాధానం ఇచ్చారు. ప్రభాస్ పుట్టినరోజున టీజర్‌ను విడుదల చేసే ప్రణాళిక లేదని ఆయన స్పష్టం చేసారు. అయితే అభిమానులను ఉత్సాహపరిచే మరో ఆసక్తికరమైన కంటెంట్‌ను అందించేందుకు చిత్రబృందం సిద్ధమవుతోందని తెలిపారు. దీంతో పుట్టినరోజు సందర్భంగా 'ఫౌజీ' నుంచి ఎలాంటి అప్‌డేట్ రాబోతోందనే ఆసక్తి పెరిగింది. అయితే ఆ ప్రత్యేక కంటెంట్ ఏమిటి? ఫస్ట్ లుక్ పోస్టరా, పాత్రకు సంబంధించిన పరిచయ వీడియోనా, మరేదైనా ప్రత్యేక ప్రకటననా? అనే విషయాలపై ఇప్పటివరకు స్పష్టత లేదు. చిత్రబృందం అధికారికంగా వెల్లడించే వరకు వేచి చూడాల్సిందే. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ప్రభాస్ విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారని ప్రచారం జరుగుతోంది. చారిత్రక నేపథ్యంతో కూడిన కథాంశంతో ఈ సినిమా రూపొందుతున్నట్లు సమాచారం. దర్శకుడు హను రాఘవపూడి గతంలో తెరకెక్కించిన 'సీతారామం' ప్రేమకథా చిత్రంగా ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో, ఈసారి ప్రభాస్‌తో ఆయన ఎలాంటి కథను చూపించబోతున్నారనే ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలో ఇమాన్వి కథానాయికగా నటిస్తున్నారు. అనుపమ్ ఖేర్, జయప్రద, మిథున్ చక్రవర్తి, చైత్ర జే. ఆచార్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు. ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా ఆయన నటిస్తున్న సినిమాల నుంచి ప్రత్యేక అప్‌డేట్స్ రావడం అభిమానులకు ఎప్పుడూ ఆసక్తికరమే. ఈసారి 'ఫౌజీ' టీజర్ వస్తుందని ఆశించిన వారికి నిర్మాత కామెంట్స్ కొంత నిరాశ కలిగించినప్పటికీ, మరో ప్రత్యేక కంటెంట్‌ను సిద్ధం చేస్తున్నారన్న వార్త ఉత్సాహాన్ని పెంచుతోంది.

# తెలుగులో బంపర్ ఆఫర్?



ప్రస్తుతం సినీరంగంలో అత్యంత బిజీగా ఉన్న యువ కథానాయికల్లో మమిత ముందు వరుసలో ఉన్నారు. ఇదిలావుంటే.. ఈ మలయాళ మందారం ఓ క్రేజీ ఆఫర్‌ని దక్కించుకున్నట్టు ఫిల్మ్ వర్గాల్లో బలంగా ఓ వార్త వినిపిస్తున్నది. రిషబ్‌శెట్టి కథానాయకుడిగా ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో మైత్రీమూవీమేకర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'జై హనుమాన్'లో మమితాబైజు నటిస్తున్నదట. ఇప్పటికే ఈ సినిమా షూట్‌లో మమిత పాల్గొన్నట్టు తెలుస్తున్నది. అయితే.. చిత్రబృందం నుంచి మాత్రం అధికారిక ప్రకటన రాలేదు. సోషల్ మీడియాలో ఈ వార్త ఓ రేంజ్‌లో హల్‌చల్ చేస్తున్నది. ఇదే నిజమైతే.. మమితా బైజు నేరుగా నటిస్తున్న తొలి తెలుగు సినిమా ఇదే అవుతుంది.

# 'రామాయణ' రెండో ట్రైలర్ దసరాకేనా..

## అక్టోబర్ 20న మరో భారీ అప్‌డేట్!

భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత భారీ అంచనాలు నెలకొల్పుతున్న చిత్రాల్లో 'రామాయణ' కూడా ఒకటి. దర్శకుడు నితేశ్ తివారీ తెరకెక్కిస్తున్న ఈ పౌరాణిక గాథలో బాలీవుడ్ స్టార్ రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయిపల్లవి సీతాదేవిగా, కన్నడ స్టార్ యశ్ రావణుడిగా కనిపించనున్నారు. అంతర్జాతీయ స్థాయి నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో చిత్రానికి సంబంధించిన రెండో థియేట్రికల్ ట్రైలర్‌ను దసరా సందర్భంగా విడుదల చేయనున్నారనే ప్రచారం ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. 'రామాయణ' చిత్రానికి సంబంధించిన రెండో ట్రైలర్‌ను అక్టోబర్ 20, 2026న విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అదే రోజున ప్రపంచవ్యాప్తంగా ముందస్తు టికెట్ విక్రయాలు కూడా ప్రారంభం కానున్నాయని కథనాలు పేర్కొంటున్నాయి. అయితే రెండో ట్రైలర్ విడుదల తేదీపై చిత్ర నిర్మాణ సంస్థ నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. దసరా పండుగ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేస్తే సినిమాపై ఉన్న అంచనాలు మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా శ్రీరాముడి శక్తి, రావణుడి భీకరమైన రూపాన్ని ప్రధానంగా చూపిస్తూ ఈ కొత్త ట్రైలర్‌ను రూపొందిస్తున్నారనే వార్తలు అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. అయితే ట్రైలర్‌లో ఉండబోయే సన్నివేశాల వివరాలపై కూడా అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడి పాత్రలో నటిస్తుండగా, సాయిపల్లవి సీతాదేవిగా కనిపించనున్నారు. ఇక 'కేజీఎఫ్' చిత్రాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు సంపాదించుకున్న యశ్.. రావణుడి పాత్రను పోషిస్తున్నారు. ఈ ముగ్గురు ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించనుండటంతో సినిమా ప్రకటన వచ్చినప్పటి నుంచే అభిమానుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి.
శ్రీరాముడి ధర్మం, రావణుడి శక్తి, సీతాదేవి పాత్ర చుట్టూ సాగే కథను అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో తెరపైకి తీసుకురావడమే చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రణ్‌బీర్, యశ్ పాత్రల రూపకల్పన ఎలా ఉండబోతోందనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నారు. యశ్ కూడా నిర్మాణ భాగస్వామిగా వ్యవహరిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో అంతర్జాతీయ స్థాయి సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు సమాచారం.






# పిల్లలలో పాఠ్యపుస్తకాల పఠనాసక్తి వల్ల జ్ఞాన వికాసం పెరుగుతుంది





శ్రీశైలం (ప్రశ్నన్యూస్) తాడేపల్లి మండలం వడ్డేశ్వరం గ్రామంలో ఉన్న మహాత్మా గాంధీ చిల్డ్రన్ పార్లమెంట్ నుండి జిల్లా ఫోరంకి ఎన్నికైన సభ్యులు గుంటూరు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరుగుతున్న గ్రీవెన్స్ కి హాజరై వడ్డేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు లైబ్రరీ ఏర్పాటు చేయాలని అర్జీ ఇవ్వటం జరిగినది.గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ వారి చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న బాలల పార్లమెంట్ లో పిల్లలకు పాఠశాలలో లైబ్రరీ గ్రంథాలయం యొక్క అవశ్యకత గురించి తెలుసుకోవడం జరిగినది,ముఖ్యంగా పిల్లల విద్యా ప్రయాణంలో మరియు వ్యక్తిత్వ వికాసంలో పుస్తక పఠనం అనేది అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుందని దీనివల్ల పిల్లలకు కలిగే ముఖ్యమైన ఉపయోగాలు గురించి అత్తోట పోతురాజు పిల్లలకు తెలియజేయటం జరిగినది.ముఖ్యంగా కథల పుస్తకాలు, కామిక్స్ , విజ్ఞాన శాస్త్ర పుస్తకాలు పిల్లల్లో చిన్నతనం నుంచే చదవడం పట్ల ఆసక్తిని, అలవాటును పెంచుతాయని పరిమితం కాకుండా ప్రపంచం, చరిత్ర, సైన్స్, మరియు విభిన్న సంస్కృతుల గురించి తెలుసుకోవడానికి లైబ్రరీ ఒక విజ్ఞాన గనిలా పనిచేస్తుంది. రకరకాల పుస్తకాలు చదవడంవల్ల పిల్లలలో పదజాలం పెరుగుతుంది వారు కొత్త పదాలను నేర్చుకుంటారు,దీనివల్ల మాట్లాడే, రాసే నైపుణ్యాలు మెరుగవుతాయని, లైబ్రరీలో నిశ్శబ్దంగా కూర్చుని చదవడం వల్ల పిల్లలలో ఏకాగ్రత పెరుగుతుందని పుస్తకాలను జాగ్రత్తగా ఉంచడం,సమయానికి తిరిగి ఇవ్వడం వంటి విషయాల ద్వారా క్రమ శిక్షణ అలవడుతుందని కథలు,నవలలు, ఊహాజనిత పుస్తకాలు చదవడం వల్ల పిల్లల ఆలోచనా శక్తి,సృజనాత్మకత మరియు ఊహాశక్తి అద్భుతంగా వికసిస్తాయని,స్వయం అభ్యాసం ఉపాధ్యాయుల సహాయం లేకుండా స్వంతంగా చదివి విషయాలను అర్థం చేసుకునే సామర్థ్యం పిల్లల్లో పెరుగుతుంది. ఇది భవిష్యత్తులో వారు ఉన్నత చదువులు చదవడానికి బాగా ఉపయోగపడుతుందని సంక్షిప్తంగా చెప్పాలంటే, పాఠశాల లైబ్రరీ అనేది కేవలం పుస్తకాలు ఉంచే గదికాదు అదిపిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే ఒక విజ్ఞాన కేంద్రం అని తెలిపి అర్జీ ఇవ్వటం జరిగినది. ఈ కార్యక్రమంలో గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిబ్బంది అనిల్ కుమార్ నాగమణి,విజయలక్ష్మి, జిల్లా ఫోరం బాలల పార్లమెంట్ సభ్యులు పాల్గొన్నారు.

# అసత్య ఆరోపణలు చేయవద్దు తప్పుడు ఆరోపణలు చేస్తే ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తాం

## వరిగుంతం గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండలపరిధిలోని వరిగుంతం గ్రామపంచాయతీ తప్పుడు ఆరోపణలు చేస్తూ కొందరు మీడియా మిత్రులు కావాలని దురుద్దేశంతో తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదని ఆ గ్రామ సర్పంచ్ యోహాన్ ఉప సర్పంచ్ బాంచ వీరేశం అన్నారు వరిగుంతం గ్రామపంచాయతీ నిధులు ఎలాంటి అవకతవకలు జరగా లేవని జరగకపోయినా క్రమ గ్రామానికి చెందిన ఓ విలేఖరి గ్రామపంచాయతీ నిధుల విషయంలో తప్పుడు ప్రచారం చేస్తూ తోటి విలేకరులను కూడా తప్పుదోవ పట్టిస్తున్నారని అసత్య ఆరోపణలు చేస్తే ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసామని హెచ్చరించారు గ్రామ కార్యదర్శి వార్డు సభ్యులు సర్పంచ్ ఉప సర్పంచ్ సంయుక్తంగా గ్రామ అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నామని కావాలని దురుద్దేశంతో తమ గ్రామానికి చెందిన జనం సాక్షి రిపోర్టర్ యేసు రత్నం మిగతా విలేకరులకు తప్పుడు మాటలు చెప్పి తమ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారని ఇట్టి వారిపై జిల్లా కలెక్టర్ మండల ప్రత్యేక అధికారికి ఫిర్యాదు చేసినట్లు ఇలాంటి తప్పుడు వార్తలు రాస్తే సహించేది లేదని హెచ్చరించారు.

# పటిష్ట ప్రణాళికతో రీసర్వే నిర్వహించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ నగేష్




మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) పటిష్ట ప్రణాళికతో గ్రామాల్లో రీ సర్వే నిర్వహించాలని అదనపు కలెక్టర్ నగేష్ రెవెన్యూ, సర్వే అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో సర్వే అధికారులు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ. రీ సర్వేలో సర్వే అధికారులు, రెవెన్యూ అధికారుల పాత్ర కీలకమన్నారు. గ్రామాల్లో రైతులకు రీసెర్వేపై అవగాహన కల్పించి, పలు సందేహాలను నివృత్తి చేయాలన్నారు. రీ సర్వే నిర్వహించిన గ్రామాల్లో 9(2) నోటీసులు అందిన వారి అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించాలన్నారు. రీ సర్వే కార్యక్రమాన్ని రెవెన్యూ ,సర్వే శాఖల సమన్వయంతో నిర్వహించాలన్నారు. పటిష్ట ప్రణాళికతో ముందుకెళ్ళినప్పుడే ప్రజలు అడిగే సందేహాలను నివృత్తి చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, ఏడి సర్వే కిషన్, రెవెన్యూ డిప్యూటీ తహసిల్దారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, సీనియర్ అసిస్టెంట్లు,సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చూడ ముచ్చటగా ముద్దపప్పు బతుకమ్మ వేడుకలు





చిట్యాల (ప్రశ్న న్యూస్) తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టే బతుకమ్మ వేడుకలతో పల్లెల నుండి నగరాల వరకు వీధులన్నీ సందడిగా మారాయి. చిట్యాల మండల పరిధిలోని చల్లగరిగ గ్రామంలో బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. మహాలయ అమావాస్య నాటి నుండి తొమ్మిది రోజుల పాటు జరుపుకునే బతుకమ్మ వేడుకల్లో భాగంగా మూడవ రోజు ముద్దపప్పు బతుకమ్మ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. సోమవారం నాడు సాయంత్రం గ్రామంలోని మహిళలంతా కలిసి సాంప్రదాయబద్ధంగా రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి స్థానిక శివాలయం ఆవరణలో అత్యంత ఉత్సాహంగా ఆడి పాడి సందడి చేశారు.

# చల్లగర్గ వడ్డెర సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఐదు లక్షల ఎస్డీఎఫ్ నిధులు



ధర్పల్లి (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె నరేష్ ఆధ్వర్యంలో ముగ్గు పోయడం, చల్లగర్గ గ్రామంలో వడ్డెర సంఘం కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి ఎస్డీఎఫ్ నిధుల కింద ఐదు లక్షలు మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో ధర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లగర్గ సర్పంచ్ గాదె నరేష్ ఆధ్వర్యంలో సోమవారం కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ స్థలంలో ముగ్గు పోయడం జరిగింది.గ్రామంలో వడ్డెర సంఘం సభ్యులకు ఉపయోగపడేలా కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే భూపతిరెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మగ్గిడి స్రవంతి ప్రసాద్ గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షులు ఎనుగంటి ముత్యం గౌడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గాదె రాజన్న మగ్గిడి రాజన్న వార్డు సభ్యుడు బాలకృష్ణ నవీన్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,వడ్డెర సంఘం సభ్యులు స్వామి పెద్ద బాలయ్య రమేష్ బాలయ్య ఎంకటి లు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎంఎల్సీ ఎన్నికల్లో పి వెంకటేష్‌కు అవకాశం వచ్చేలా కృషి చేస్తా

## - బూర నర్సయ్యగౌడ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) వెనుకబడిన తరగతుల సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని బీజేపి ఇంటలెక్చువల్ కన్వీనర్ పి. వెంకటేష్ అన్నారు. మాజీ పార్లమెంటు సభ్యులు, రాష్ట్ర బీసీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్‌ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి త్వరలో జరగనున్న మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ పట్టభద్రుల ఎంఎల్సీ ఎన్నికల్లో బీజేపి అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతు కేంద్రంలోని బీజేపి ప్రభుత్వ హయాంలో బీసీల అభ్యున్నతి కోసం చేపట్టిన సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో దిగ్విజయంగా ప్రజల్లోకి తీసుకెళ్తు, పార్టీ బలోపేతం కోసం నిరంతరం పాటు పడుతు కేంద్ర ప్రభుత్వ పథకాల లక్ష్యాలను ఇంటింటికి చేరేలా కార్యాచరణ రూపొందించి నిర్విరామంగా కృషి చేస్తున్నానని తెలిపారు. పార్టీ పట్ల విధేయత, ప్రజాసేవలో తనకున్న నిబద్ధతను గుర్తించి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ పట్టభద్రుల ఎంఎల్సీ ఎన్నికల్లో బీజేపి అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతు త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎంఎల్సీ స్థానంలో బీజేపి ఎంఎల్సీ అభ్యర్థిగా పి. వెంకటేష్‌కు అవకాశం కల్పించేలా తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.

# కిష్టాపూర్‌లో బతుకమ్మ ఘాట్ల వద్ద లైటింగ్, పారిశుద్ధ్య ఏర్పాట్లు చేయాలి

## - డిప్యూటీ కమిషనర్‌కు మాజీ కౌన్సిలర్ తుడుం గణేష్ వినతి



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) పూడూర్-కిష్టాపూర్ కార్పొరేషన్ పరిధిలోని కిష్టాపూర్‌లో బతుకమ్మ వేడుకలు, దసరా పండుగ సందర్భంగా ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరుతూ డిప్యూటీ కమిషనర్‌కు మాజీ కౌన్సిలర్ తుడుం గణేష్ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కిష్టాపూర్‌లో బతుకమ్మ ఆడే ప్రదేశాల్లో లైటింగ్, సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని, బతుకమ్మ ఘాట్లకు పెయింటింగ్ వేయించి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. బతుకమ్మ ఘాట్ల వద్ద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ సిబ్బందిని నియమించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా దసరా పండుగ రోజున జమ్మి ములక్కాత్ సెంటర్ వద్ద తగిన లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు రావణాసురుడి దహన కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరారు. జమ్మి పూజ నిర్వహించే స్థలం పరిసరాలను శుభ్రం చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని మున్సిపల్ అధికారులను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ తుడుం గణేష్, కుమార్ పాల్గొన్నారు.

# డబిల్‌పూర్ చెరువు కట్టపై రోడ్డు ప్రమాదం

## బొలెరో వాహనం ఢీకొని నాగులూరి సురేష్ మృతి



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం లింగాపూర్ గ్రామానికి చెందిన నాగులూరి సురేష్ (52) తన ద్విచక్ర వాహనంపై మేడ్చల్‌కు డబిల్‌పూర్ గ్రామ చెరువు కట్టపై వెళ్తుండగా టీఎస్ 09 యూడీ 3583 నంబర్ గల బొలెరో వాహనం ఆయన వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సురేష్ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# చైనామాంజ విషయంలో అప్రమత్తంగా ఉండాలి

## సామాజికవేత్త కోల రవీందర్ ముదిరాజ్



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )చైనామాంజ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సామాజికవేత్త కోల రవీందర్ ముదిరాజ్ సూచించారు.చైనామాంజ వల్ల రోడ్డుపైన బైక్ పై వెళ్లేవారు గతంలో మెడ తెగి చనిపోయిన సందర్భాలు ఉన్నాయని గతంలో ఒక మిలిటరీ ఉద్యోగి, ఒక కానిస్టేబుల్, పాదచారులు ప్రమాదానికి గురైన సంఘటనలు చూసామని తెలిపారు.జీడిమెట్లలో బిఆర్ రాష్ట్రానికి చెందిన మనీషనే వ్యక్తి గాయాల పాలు అయ్యారని గుర్తు చేశారు. చైనా మంజ విక్రయదారులపై కేసులు నమోదు చేయాలని రవీందర్ ముదిరాజు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎం రాజు అనిల్ అశోక్ రెడ్డి పాల్గొన్నారు

# బోయిన్ పల్లి మార్కెట్ లో సెక్రటరీ బాధ్యతలు స్వీకరణ.



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో గత పది రోజులుగా కుర్చీ ఖాళీగా ఉన్న విషయం విదితమే.పాపం ఎంతో మంది ఎన్నో రకాల పైరవీలు చేసినప్పటికీ ఫలితం శూన్యం.గత సెక్రటరీ రిటైర్మెంట్ కాకముందే నెల రోజుల ముందు నుంచే మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే ఆశీస్సులు పుష్కలంగా ఉన్నప్పటికీ సిఫార్సులు చేసుకున్న పలువురికి చుక్కెదురైంది.ఇక అసలు విషయానికి వస్తే బోయిన్ పల్లి మార్కెట్ లో వ్యాపార వర్తకులు, యార్డ్ అధికారులు సైతం ఎవ్వరు వస్తారో అని రోజు రోజుకీ వారిలో ఉత్కంఠ నెలకొంది.ఏదేమైన ప్రభుత్వం ఇలాంటి అపోహలకు ఎక్కువ అవుతున్న నేపథ్యంలో చెక్ పెట్టింది.సర్కార్ ఉత్తర్వులు మేరకు పాత సెక్రటరీ ఎం.వెంకన్న నిన్న డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ సెక్రటరీ గా బాధ్యతలు చేపట్టారు.అయితే ఈ నెలఒకటో తారీఖున మిర్యాలగూడ మార్కెట్ లో రిలీవ్ అయ్యి, అనంతరం అనివార్య కారణాల వల్ల సెలవుల్లో వెళ్లి,నిన్న ప్రభుత్వం ఉత్తర్వులు మేరకు నిన్న జాయినింగ్ రిపోర్ట్ చేశారు.

# పెద్దశేష వాహనంపై శ్రీ మలయప్ప కనువిందు

## నవరాత్రి బ్రహ్మోత్సవాలకు వైభవంగా శ్రీకారం

## ఏడుతలల స్వర్ణశేష వాహనంపై తిరుమాడ వీధుల్లో స్వామివారి ఊరేగింపు



తిరుమల(ప్రశ్న న్యూస్) తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు సోమవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు ఏడుతలల స్వర్ణశేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ గోవిందరాజస్వామి అలంకారంలో స్వర్ణశేష వాహనాన్ని అధిష్ఠించి తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. గోవింద నామస్మరణల మధ్య స్వామివారి వాహనసేవను భక్తులు భక్తిశ్రద్ధలతో తిలకించారు.

### ఆదిశేషుడిపై స్వామివారి విహారం

శ్రీమహావిష్ణువుకు ఆదిశేషుడు అత్యంత సన్నిహితుడు. తన పడగల నీడలో స్వామివారికి సేవలందిస్తూ, పాన్పుగా ఉంటూ దాస్యభక్తికి ప్రతీకగా నిలుస్తాడు. శ్రీమహావిష్ణువు రామావతారంలో లక్ష్మణుడిగా, ద్వాపరయుగంలో బలరాముడిగా అవతరించి స్వామివారికి సన్నిహిత సేవలు అందించినట్లు పురాణాలు వివరిస్తున్నాయి. అటువంటి ఆదిశేషుడిపై శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీ వేంకటేశ్వరస్వామివారు భక్తులకు దర్శనమివ్వడం వాహనసేవ విశిష్టతను చాటింది.

### నేడు చిన్నశేష, హంస వాహన సేవలు

నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం చిన్నశేష వాహనంపై, రాత్రి హంస వాహనంపై శ్రీ మలయప్పస్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

తొలిరోజు వాహనసేవలో శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈవో భాస్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జవహర్ నగర్‌లో విద్యుత్ మీటర్ల దందా.?

- ప్రభుత్వ భూముల కబ్జాలకు విద్యుత్ కనెక్షన్ల అండనా.?
- నోటరీ పేపర్లు ఉంటే చాలు.. మీటర్ జారీకి గ్రీన్ సిగ్నలా.?
- ఒక్కో మీటర్‌కు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు వసూళ్లంటూ ఆరోపణలు
- లైన్‌మెన్ నుంచి డీఈ వరకు అధికారుల పాత్రపై అనుమానాలు
- ప్రభుత్వ భూముల పరిరక్షణలో రెవెన్యూ యంత్రాంగం మౌనం ఎందుకు.?





**జవహర్ నగర్ (ప్రశ్న న్యూస్)** జవహర్ నగర్ పరిధిలో విద్యుత్ మీటర్ల జారీ వ్యవహారం వివాదాస్పదంగా మారుతోంది. ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న స్థలాలకు భారీగా లంచాలు తీసుకొని విద్యుత్ మీటర్లు మంజూరు చేస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. ప్రభుత్వ భూమిపై హక్కును నిర్ధారించే రిజిస్ట్రేషన్ పట్టాలు లేకపోయినా, బాండ్ పేపర్లపై నోటరీ చేయించిన పత్రాలను ఆధారంగా చేసుకుని విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అసలు ఈ మీటర్ల జారీకి అధికారులు అనుసరిస్తున్న నిబంధనలు ఏమిటి.? ఏ ప్రాతిపదికన అనుమతులు ఇస్తున్నారు.? నిబంధనల ప్రకారమే వ్యవహరిస్తున్నారా.? లేక అక్రమాలకు తెరలేపుతున్నారా.? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే ఈ వ్యవహారంలో డిఈ హస్తము ఉన్నట్టు ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తున్నారు.

### నోటరీ పేపర్లకే ఇంత విలువా.?

ప్రభుత్వ భూములకు సంబంధించి చట్టబద్ధమైన హక్కులు(పట్టా) నిర్ధారించే పత్రాలు లేకుండానే నోటరీ పత్రాల ఆధారంగా విద్యుత్ మీటర్లు మంజూరు చేస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. బాండ్ పేపర్‌పై నోటరీ చేయించుకుంటే చాలు.. విద్యుత్ మీటర్ పొందవచ్చా.? నోటరీ పత్రం ఒక స్థలంపై యాజమాన్య హక్కును కల్పిస్తుందా.? ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందా లేదా అనే అంశాన్ని పరిశీలించకుండానే కనెక్షన్లు మంజూరు చేస్తున్నారా.? అన్నది తేలాల్సి ఉంది. అక్రమంగా విద్యుత్ మీటర్లు జారీ చేయడం వెనక ఎంత మొత్తంలో చేతులు మారాయో పూర్తిస్థాయిలో విజిలెన్స్ విచారణ చేయించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. విద్యుత్ కనెక్షన్ మంజూరు చేసుకున్న వాళ్లు ఒక్కటే భూమిపై యాజమాన్య హక్కును పొందినట్టు ఎక్కడ నిర్ధారించదు. అయినప్పటికీ కనెక్షన్ల జారీ ప్రక్రియను ఆసరాగా చేసుకుని ఆక్రమణదారులు తమ స్థలాలపై హక్కు ఉన్నట్లు ప్రచారం చేసుకునే పరిస్థితి ఏర్పడుతోందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఏ ఈ, ఏడీఈ, డిఈ అధికారులు ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలిస్తున్నారా లేదా అన్నది ఉన్నతాధికారులే స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. గత 15 సంవత్సరాలుగా మీటర్ల జారీపై ఆర్.టి.ఐ సమాచారం సేకరించి వాస్తవాలను తెలుగులోకి తేవాలని స్వచ్ఛంద సంస్థలు కోరుతున్నాయి.

### ఒక్కో మీటర్‌కు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకా.?

జవహర్ నగర్ పరిధిలో విద్యుత్ మీటర్ల జారీ వ్యవహారంలో భారీగా అక్రమ వసూళ్లు జరుగుతున్నాయనే ఆరోపణలు మరింత సంచలనం సృష్టిస్తున్నాయి. ఒక్కో మీటర్ మంజూరుకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు లైన్మెన్, ఏఈలు కలిసి అక్రమంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో లైన్‌మెన్ నుంచి ఏఈ, ఏడిఈ, డీఈ స్థాయి అధికారుల వరకు కొందరి పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
భారీ స్థాయిలో మీటర్ల మంజూరు వెనుక ఎవరైనా మధ్యవర్తుల ద్వారా వసూళ్లకు పాల్పడుతున్నారా.? ఇప్పటివరకు ఎన్ని మీటర్లు మంజూరయ్యాయి.? వాటిలో ఎన్ని ప్రభుత్వ భూములు లేదా వివాదాస్పద స్థలాలకు సంబంధించినవి.? దరఖాస్తుల పరిశీలనలో ఎలాంటి పత్రాలను ప్రామాణికంగా తీసుకున్నారు.? అనే అంశాలపై స్టేట్ విజిలెన్స్ అధికారులచే సమగ్ర విచారణ జరగాల్సి ఉంది. ఇప్పటికే ఈ వ్యవహారంలో విద్యుత్ శాఖ సిబ్బంది, అధికారులు భారీగా అక్రమ సంపాదన కూడబెట్టారంటూ వినిపిస్తున్న ఆరోపణలపైనా ఏసీబీ అధికారులు వచ్చి పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

### కబ్జాలు ఒకవైపు.. కనెక్షన్లు మరోవైపు

ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ యంత్రాంగం ఒకవైపు ఆక్రమణలను అడ్డుకోవాల్సి ఉండగా, మరోవైపు ఆ భూముల్లో నిర్మాణాలకు విద్యుత్ కనెక్షన్లు ఎలా మంజూరవుతున్నాయన్నది కీలక ప్రశ్నగా మారింది. ప్రభుత్వ భూములపై ఆక్రమణల ఆరోపణలు ఉన్నప్పుడు రెవిన్యూ, విద్యుత్ శాఖ ల అధికారులు సమన్వయంతో పరిశీలన చేపట్టాల్సిన అవసరం లేదా.? తహసీల్దార్, ఆర్డీవో, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారంపై దృష్టి సారించారా.? ఆక్రమణలపై ఫిర్యాదులు అందినా చర్యలు తీసుకోలేదా.? ఎందుకు తీసుకోలేదన్న ప్రశ్నలకు సమాధానాలు అధికారులు సమాధానం చెప్పాలని స్థానికుల డిమాండ్ చేస్తున్నారు.

### అధికారుల మౌనం.. అక్రమార్కులకు అండనా.?

ప్రభుత్వ భూముల పరిరక్షణ, విద్యుత్ మీటర్ల జారీ ప్రక్రియలో పారదర్శకత కోసం ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. నోటరీ పత్రాల ఆధారంగా మంజూరైన కనెక్షన్లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా జారీ చేసిన మీటర్లు ఉన్నాయా లేదా నిర్ధారించాలి. కబ్జా స్థలాలలో నిబంధనలకు విరుద్ధంగా జారీ చేసిన మీటర్లను వెంటనే రద్దు చేసి ప్రభుత్వం తీసుకోవాలని, అదేవిధంగా భారీగా అక్రమ వసూళ్ల ఆరోపణలపై ఏసీబీ అధికారులచే విచారణ జరిపి బాధ్యులను ఉద్యోగం నుండి శాశ్వతంగా తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారికి రెవిన్యూ, విద్యుత్, మున్సిపల్ శాఖల అవినీతి అధికారులతో పరోక్షంగా పూర్తి సహకారం అందుతోందన్న అనుమానాలకు తెరదించాల్సిన బాధ్యత విద్యుత్ శాఖతో పాటు రెవెన్యూ, మున్సిపల్ ఉన్నత అధికారులపైన, జిల్లా కలెక్టర్ పైన ఉంది. జవహర్ నగర్‌లో ఎన్ని మీటర్లు నోటరీ పత్రాల ఆధారంగా మంజూరు చేశారు.? వాటికి సంబంధించిన దరఖాస్తులు, పరిశీలన నివేదికలు ఏమిటి.? అక్రమ వసూళ్ల ఆరోపణలపై విచారణ ఎప్పుడు ప్రారంభిస్తారు.? అన్న ప్రశ్నలకు ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది.ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి జవహర్ నగర్ లో ప్రభుత్వ భూముల కబ్జాల ను పూర్తిస్థాయిలో వెలికితీస్తారా.? లేక ప్రభుత్వ భూముల ఆక్రమణలు, విద్యుత్ మీటర్ల జారీపై జరుగుతున్న అవినీతి అక్రమాలను ప్రోత్సహిస్తారా.? వేచి చూడాలి.

## పొన్నం ప్రభాకర్ సవాల్‌కు
# రాంచందర్ రావు స్పందన



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ మధ్య రాజకీయ వేడి రాజుకుంది. ఓటర్ల జాబితా సవరణలో పేర్ల తొలగింపు అంశంపై ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. ఈ క్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బహిరంగ సవాల్ విసిరారు. ఓటర్ల జాబితాల సవరణపై బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ఓట్ల తొలగింపుపై రాంచందర్ రావు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, "రాంచందర్ రావు తేదీ, సమయం ప్రకటిస్తే.. ఓటు హక్కు కోల్పోయిన వారిని ఆధారాలతో సహా ఆయన ముందుకే తీసుకొస్తాను" అని పొన్నం స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియలో పొరపాట్లు జరిగితే సరిదిద్దాల్సింది పోయి, బీజేపీ నేతలు బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు.మంత్రి పొన్నం సవాల్‌పై స్పందించిన రాంచందర్ రావు ఓట్లు తొలగించబడినట్టు చెబుతున్న ఒక 10 మందిని ఎన్నికల సంఘం కార్యాలయానికి తీసుకురావాలని ప్రతి సవాల్ విసిరారు. ఇదే సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేసి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ పథకాన్ని అమలు చేయని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కాగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకం నుంచి వైదొలగగా, రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి ఫసల్ బీమా యోజనలో చేరాలని ఈ ఏడాది మార్చిలోనే నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. మొత్తంమీద, ఈ సవాళ్లు, ప్రతిసవాళ్లతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది.

# విజయవాడ బైపాస్పై కారు దగ్ధం

## – నలుగురు సజీవ దహనం



అమరావతి (ప్రశ్న న్యూస్) విజయవాడ నగర శివార్లలోని వెస్ట్ బైపాస్ రోడ్డుపై ఘోర ప్రమాదం చోటుచేసుకోవడం తెలిసిందే. ఓ ఎలక్ట్రిక్ కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగి, అందులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు సజీవ దహనమయ్యారు. ఈ తీవ్ర విషాద ఘటనలో మరొకరు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. ఈ దుర్ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి సాధ్యమైనంత ఉత్తమమైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ కూడా ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. క్షతగాత్రుడికి మెరుగైన చికిత్స అందేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనంలో మంటలు చెలరేగడానికి గల సాంకేతిక కారణాలపై దృష్టి సారించాలని పవన్ కల్యాణ్ అధికారులను కోరారు. "విజయవాడ వెస్ట్ బైపాస్ లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులు చనిపోవడం తీవ్రంగా కలచివేసింది. మృతులకు నివాళులు అర్పిస్తున్నాను. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం. మృతుల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను" అని నారా లోకేశ్ పేర్కొన్నారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రెయిలింగ్‌ను ఢీకొన్న వెంటనే కారు లాక్ అయి, మంటలు వేగంగా వ్యాపించడంతో లోపల ఉన్నవారు బయటకు రాలేకపోయారని తెలుస్తోంది. ఈ విషాద ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# రేవంత్ పాలనలో వెనుకబడుతున్నారా.?

## మాటలలో దూకుడు – పథకాల అమల్లో ఆలస్యం

- కాంగ్రెస్ పాలనపై విశ్వాసం కోల్పోతున్న ప్రజలు – ప్రభుత్వ అధికారులలో విపరీతంగా పెరిగిన అవినీతి
- ఉన్నతఅధికారులకు, మంత్రులకు ఫిర్యాదు చేసిన పట్టింపేది.?
- రాబోయే కార్పొరేషన్ ఎన్నికలపై పాలన ప్రభావం ఉంటుందా.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయ తెరపై ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి వేస్తున్న ఎత్తులు, పైఎత్తులు ప్రత్యర్థులకు నిద్రలేకుండా చేస్తున్నాయి. రాజకీయ వ్యూహాల్లోనూ, మైండ్ గేమ్‌లోనూ తనదైన దూకుడు ప్రదర్శిస్తున్న రేవంత్ పాలన విషయానికి వచ్చేసరికి మాత్రం అదే స్థాయిలో సక్సెస్ కాలేకపోతున్నారనే విమర్శలు క్షేత్రస్థాయి నుంచి గట్టిగా వినపడుతున్నాయి. ప్రభుత్వ మార్పుతో సరికొత్త సంచలనాలు వస్తాయని ఆశించిన సామాన్య ప్రజలు కనీసం గతంలో అందిన పాలన, సంక్షేమ పథకాలైనా సక్రమంగా అందుతాయా లేదా అనే సందేహంలో పడిపోయారు.

### రైతు పథకాల అమల్లో అసంతృప్తి

గత బీఆర్ఎస్ హయాంలో అమలులో ఉండి, ప్రజల దైనందిన జీవితంలో భాగమైన కొన్ని పథకాలు రేవంత్ రెడ్డి పాలనలో పూర్తిగా మందగించడం, అసలు అమలు కాకపోవడం ప్రధాన విమర్శలకు దారితీస్తోంది. కొత్తగా ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలు అమల్లో సాంకేతిక, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్న సమయంలో, పాత పథకాల పంపిణీలో సైతం ఆలస్యం జరగడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని పెంచుతోంది. ముఖ్యంగా రైతు సంక్షేమం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎలాంటి నిబంధనలు లేకుండా లభించిన రైతు బీమా పథకాలు కాంగ్రెస్ తెచ్చిన రైతు భరోసా పేరు మార్పుతో పాటు ఆంక్షలు పెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. సాగులో లేని భూములు, గుట్టలకు పెట్టుబడి సాయం కట్ చేస్తామని ప్రకటించినప్పటికీ, అసలైన రైతులకు వానాకాలం, యాసంగి పెట్టుబడి సహాయం అందించడంలో విపరీతమైన ఆలస్యం జరుగుతోందని ప్రతిపక్షాలు , రైతు సంఘాలు మండిపడుతున్నాయి. విద్యుత్ సైతం సక్రమంగా అందడం లేదన్న విమర్శలు ఎదురవుతున్నాయి. గ్రామాలలో నిత్యం కరెంటు కోత ఏర్పడుతుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### కల్యాణలక్ష్మి నగదు అందడం గగనం

పేద కుటుంబాల్లో పెళ్లిళ్లకు కొండంత అండగా నిలిచే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్' పథకాల పరిస్థితి కూడా దయనీయంగా మారింది. దరఖాస్తులు చేసుకుని నెలలు గడుస్తున్నా లబ్ధిదారులకు చెక్కులు అందడం లేదని, రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది అప్లికేషన్లు పెండింగ్‌లో పడిపోయాయని విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం తులం బంగారం ఇస్తామని ఎన్నికల వేళ హామీ ఇచ్చినప్పటికీ, పాత ఆర్థిక సహాయం రూ. 1,00,116 అందించడంలోనే నత్తనడక నడవడం ఆర్థిక లోటును తేటతెల్లం చేస్తోంది. రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర ఆర్థిక లోటు, భారీ రుణభారం కారణంగానే సంక్షేమ పథకాలకు సకాలంలో నిధులు విడుదల చేయలేకపోతున్నామని పాలకపక్షం సమర్థించుకుంటున్నప్పటికీ.. ప్రజలకు మాత్రం లబ్ధి వేగంగా అందడం లేదనేది వాస్తవం.

### రాజకీయాల కన్నా ప్రజా సంతృప్తి కీలకం

బీఆర్ఎస్ హయాంలో లోపాలున్నప్పటికీ పథకాలు నిరంతరాయంగా అందేవని, కానీ ఇప్పుడు నిధుల కొరత సాకుగా చూపి కావాలని ఆలస్యం చేస్తున్నారనే భావన పల్లెల్లో వ్యక్తమవుతోంది. రాజకీయంగా ప్రత్యర్థులను కార్నర్ చేయడంలోనూ, పట్టు నిలుపుకోవడంలోనూ నిరంతరం బిజీగా ఉంటున్న రేవంత్ రెడ్డి గ్రౌండ్ లెవెల్ అడ్మినిస్ట్రేషన్‌పై అదేస్థాయి దృష్టి పెట్టలేకపోతున్నారనేది ఎక్కువ మంది అభిప్రాయం. అడ్మినిస్ట్రేషన్ పై ఏమాత్రం పట్టులేదని పూర్తిగా విఫలమయ్యారని ప్రతిపక్ష నాయకులు సైతం బహటంగా విమర్శిస్తున్నారు. ముఖ్యమంత్రి ప్రతిపక్షాలపై విమర్శలతో సమయం గడపడం కంటే, ప్రజలకు నిత్యావసరాలుగా మారిన సంక్షేమ పథకాలను నిరంతరాయంగా అందిస్తేనే ప్రభుత్వానికి నిజమైన దూకుడు ఇమేజ్ లభిస్తుందని అంటున్నారు. అధికారుల నిర్లక్ష్యాన్ని, ప్రజల సమస్యలను పట్టించుకోవడంలేదని సాక్షాత్ ముఖ్యమంత్రి వద్ద ఉన్న శాఖల అవినీతి భారీగా పెరిగిపోవడంతో పాటు విధుల పట్ల అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న పట్టించుకునే నాథుడు లేకుండా పోవడంతో రోజురోజుకు రేవంత్ రెడ్డి సర్కారుపై ప్రజలకు విశ్వాసం పూర్తిగా సన్నగిల్లుతోంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో దీని ప్రభావం కచ్చితంగా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అర్థం చేసుకుంటే పదేళ్ల పాలన లేకపోతే ఐదేళ్ల పాలన అన్నట్టుగా ఉండి పరిస్థితి.




Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588